ప్రజాశక్తి

సోమవారం 22 జులై 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

గ్రేటర్‌లో వైసిపికి షాక్



టిడిపి, జనసేనల్లో చేరిన కార్పొరేటర్లతో కూటమి నేతలు పల్లా శ్రీనివాస్, వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు

- టిడిపిలోకి ఏడుగురు, జనసేనలోకి ఐదుగురు కార్పొరేటర్లు చేరిక
- మేయర్ పదవిపై కూటమి కన్ను
- స్థాయి సంఘంపై పాగా లాంఛనమే..

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలోని అతి పెద్దదైన గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జివిఎంసి)పై కూటమి నాయకులు కన్నేశారు. అనుకున్నదే తడవుగా స్థానిక తెలుగుదేశం, జనసేన నాయకులు చక్రం తిప్పారు. జివిఎంసిలో వైసిపిని చావు దెబ్బ కొట్టారు. కొద్దిరోజులుగా విశాఖలోని టిడిపి, జనసేన నాయకులు చేసిన ప్రయత్నాలు ఫలించడం, ఒకేసారి తమపార్టీకి చెందిన 12 మంది కార్పొరేటర్లు పార్టీ ఫిరాయించడం వైసిపికి ఊపిరిసలపనివ్వడం లేదు. జంప్ అయిన వారిలో ఏడుగురు తెలుగుదేశం పార్టీలో, ఐదుగురు జనసేన పార్టీలో చేరారు. దీంతో జివిఎంసిలో బలబలాలు మారిపోయాయి.

గడ్డు పరిస్థితిలో వైసిపి

కొద్దిరోజుల్లో మరి కొంతమంది వైసిపి కార్పొరేటర్లు కూటమిలోని పార్టీలలో చేరనున్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే జివిఎంసిలో గత మూడున్నరేళ్లగా పాలన సాగిస్తున్న వైసిపి మరింత గడ్డు పరిస్థితి నెలకొంటుందని చెప్పవచ్చు. జివిఎంసి పాలకవర్గానికి 2021 మార్చి 16న ఎన్నికలు జరిగాయి. జివిఎంసిలో 98 మంది కార్పొరేటర్ల పదవులకు ఆ ఎన్నికలు సాగగా వైసిపి అత్యధిక స్థానాలను గెలుపొంది మేయర్ పీఠం కైవసం చేసుకుంది. టిడిపికి 30 స్థానాలు దక్కగా, జనసేన రెండు చోట్ల, బిజెపి ఒకచోట, సిపిఎం, సిపిఐ ఒక్కొక్క చోట గెలుపొందాయి. ఇండిపెండెంట్లు నాలుగు చోట్ల గెలుపొందారు. అనంతరం మారిన రాజకీయ పరిస్థితులలో టిడిపి 31వ వార్డు కార్పొరేటర్ మృతి చెందడంతో ఉప ఎన్నికల్లో వైసిపి గెలిచింది. అలాగే దక్షిణ నియోజకవర్గానికి చెందిన ముగ్గురు ఇండిపెండెంట్ అభ్యర్థులు ప్రారంభంలో వైసిపిలో చేరారు. ఆ తర్వాత వారు జనసేనలోకి మారారు. దీంతో జనసేన బలం ఐదుకు చేరింది. అలాగే వైసిపికి చెందిన 29వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు ఆ పార్టీకి దూరమై బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఉండే సీతంరాజు సుధాకర్‌తో కలిశారు. ఆ తరువాత సుధాకర్ ఆ పార్టీని వీడి టిడిపిలో చేరడంతో కార్పొరేటర్ నారాయణరావు కూడా ఆయనతో కలిశారు. అలాగే టిడిపి నుంచి 41వ వార్డులో గెలుపొందిన కోడిగుడ్ల మిగతా 2లో..



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుందాం

- ప్రజా సమస్యల పట్ల ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేలా ఉద్యమాలు
- సిపిఎం విశాఖ జిల్లా ప్లీనంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్రతిష్టాత్మకమైన వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను పోరాటాలతో కాపాడుకోవాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేలా ఉద్యమించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ విశాఖ జిల్లా ప్లీనం స్థానిక శివాజీపాలెంలోని సవేరా ఫంక్షన్ హాలులో ఆదివారం పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన లోకనాథం మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ భవిష్యత్తుపై అటు కార్మికులు, నిర్వాసితులు, ఇటు ప్రజానీకంలో ఆందోళన నెలకొందన్నారు. మూడున్నరేళ్లుగా ఉక్కు పరిశ్రమను రక్షించుకోవడానికి జరుగుతున్న ఆందోళనకు సిపిఎం అండగా నిలిచిందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై ఎన్‌డిఎ కూటమి పక్షాలైన తెలుగుదేశం, జనసేన పార్టీలు ఒత్తిడి తెచ్చి ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. విశాఖ జిల్లాలో అన్ని సీట్లలో ప్రజలు కూటమి పార్టీల అభ్యర్థులను గెలిపించారని, స్టీల్‌ప్లాంట్ మిగతా 2లో..

కార్పొరేటర్ల చేరికను వ్యతిరేకిస్తున్న స్థానిక టిడిపి నేతలు

వార్త 4లో..

సింహగిరిపై పోటెత్తిన భక్తజనం

వార్త 4లో..

రోడ్డు, విద్యుత్ సౌకర్యం కోసం గిరిజనుల పాదయాత్ర

వార్త 8లో..



సదస్సులో మాట్లాడుతున్న రమేష్ బాబు, వేదికపై యుటిఎఫ్ నాయకులు ప్రసాద్ తదితరులు

నూతన క్రిమినల్ చట్టాలు హానికరం

ఐలు జాతీయ కౌన్సిల్ సభ్యులు రమేష్ బాబు వార్త మెయిన్‌లో..

ఆ రికార్డులు ఏమయ్యాయి..!

- ఆక్రమణదారులను కాపాడే పనిలో రెవెన్యూ
- ట్యాంపరింగ్ కాలంలో గల్లంతు
- సిట్ నివేదిక బయటపెడితే తేలనున్న భూ బకాసురుల భాగోతం
- న్యాయస్థానాల తుది తీర్పునకు లోబడి చర్యలు : పరవాడ తహశీల్దార్ గణపతిరావు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, పరవాడ విలేకరి

ప్రభుత్వ భూమి ప్రయివేటు వ్యక్తుల పేర నమోదైన కాలంలో రెవెన్యూ రికార్డులు లేకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఉద్దేశపూర్వకంగా ప్రయివేటు వ్యక్తులకు సహకరించిన విషయం బయటకు పొక్కకుండా పరవాడ తహశీల్దార్ కార్యాలయంలో రికార్డులను మాయం చేశారన్న అనుమానాలు మరింత బలపడేలా రెవెన్యూ అధికారుల వ్యవహారశైలి వుంది. పరవాడ మండలం దేశపాత్రునిపాలెం రెవెన్యూలోని పలు సర్వే నెంబర్లలో దాదాపు రూ.460 కోట్ల విలువైన 96 ఎకరాల ప్రభుత్వ భూమి ప్రభుత్వం అసైన్ చేయకుండా చేసినట్లు రెవెన్యూ రికార్డుల్లో కొంతమంది పేర్లు నమోదుకావడం, అసైన్ చేసిన వారి పేరు బదులు సంబంధంలేని కొందరి పేర్లు రికార్డుల్లోకి ఎక్కడం వంటి మతలబులు చాలానే జరిగాయి. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై విచారణ చేపట్టాలని ప్రభుత్వం నియమించిన స్పెషల్ ఇన్విస్టిగేషన్ టీమ్ (సిట్)కు దేశపాత్రునిపాలేనికి చెందిన కొందరు అప్పట్లో ఫిర్యాదు చేశారు. తెలుగుదేశం, వైసిపి ప్రభుత్వాలు నియమించిన సిట్ తమ విచారణ పూర్తిచేసి నివేదిక ప్రభుత్వానికి సమర్పించింది. తమ పార్టీకి చెందిన నాయకుల భూ ఆక్రమణల బండారం బయటపడుతుందని రెండు ప్రభుత్వాలూ పూర్తి నివేదికను బహిర్గతం చేయలేదు. సిట్ మిగతా 2లో..



పరవాడ తహశీల్దార్ కార్యాలయం

మొదటి పేజీ తరువాయి..

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుందాం

వంటి సమస్యలను వారు పట్టించుకోవాలని అన్నారు. ప్రజా సమస్యలపై సిపిఎం నాయకులు, కార్యకర్తలు క్రియాశీలకంగా కదులుతూ పరిష్కారానికి క్షేత్రస్థాయిలో కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిందని, పాలన కూడా ప్రజానుకూలంగా మారాలని లోకనాథం ఆకాంక్షించారు. ఇటీవల కాలంలో కొన్ని హింసాత్మక ఘటనలు రాష్ట్రంలో చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. వాటిని నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సిపిఎం భవిష్యత్ కార్యాచరణ, కర్తవ్యాలను ప్లీనంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు వివరించారు. ఈ ఏడాది డిసెంబరులో పార్టీ విశాఖ జిల్లా మహాసభలు నిర్వహించనున్నామని తెలిపారు. ప్లీనం వేదికపై పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, బొట్టా ఈశ్వరమ్మ, బి.పద్మ, కెఎం.శ్రీనివాస్, బి.జగన్ ఉన్నారు.

ఆ రికార్డులు ఏమయ్యాయి.. !

నివేదిక బయటపెట్టక పోవడంతో ఆక్రమణదారులకు పరోక్షంగా ప్రభుత్వమే సహకరించినట్లయింది.

కొంతమంది రెవెన్యూ సిబ్బంది ఆక్రమణదారుల నుంచి చేతివాటం ప్రదర్శించి పాస్ పుస్తకాలు మంజూరు చేయడం, 1బి రికార్డుల్లో నమోదు చేయడంతో ఆ ఆధారాలతో కొందరు కోర్టును ఆశ్రయించారు. భూమిపై యాజమాన్య హక్కు తనకు వుందంటూ కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ భూమిపై రెవెన్యూ అధికారులను అడుగుపెట్టనీయకుండా చేస్తున్నారు. ఏ సంవత్సరాల్లో రికార్డులు ట్యాంపరింగ్ జరిగాయని అనుమానాలు వ్యక్తమవుతున్నాయో.. ఆ కాలానికి సంబంధించిన రెవెన్యూ రికార్డులు పరవాడ తహశీల్దార్ కార్యాలయంలో లభ్యంకావడంలేదు. రికార్డులు ట్యాంపరింగ్ జరిగినట్లు భావిస్తున్న 2005 - 2009 మధ్య కాలంలోని దేశపాత్రునిపాలెం రెవెన్యూ రికార్డులు దొరకడంలేదు. ట్యాంపరింగ్ జరగని 2005కు ముందు, ట్యాంపరింగ్ జరిగిన 2009 తరువాత నుంచి రెవెన్యూ రికార్డులు అందుబాటులో వున్నాయి. 1988 నుంచి 2004 వరకు, (2005 నుంచి 2009 మినహా) 2011 నుంచి దేశపాత్రునిపాలెం రికార్డులున్నట్లు డిప్యూటీ తహశీల్దార్ సమాధానమిచ్చారని ఆర్‌టిఐ కింద దరఖాస్తు చేసిన పరవాడ మండలం, జాజులవానిపాలేనికి చెందిన లక్కరాజు మోహన్‌రావు 'ప్రజాశక్తి'కి తెలిపారు. ట్యాంపరింగ్ జరిగిన కాలంనాటి డిఆర్ రికార్డులు కార్యాలయంలో ఇవ్వడంలేదని ఆయన వివరించారు.

2023 ఆగస్టు 31న దేశపాత్రునిపాలెం గ్రామ సర్వే నెంబరు 202, 342-5కు సంబంధించి ఫసలీ 1416, 1417, 1418, 1419ల విఎ నెంబరు 3 నఖలు ఇవ్వాలని పరవాడ తహశీల్దార్ కార్యాలయంలో మోహన్‌రావు ఆర్‌టిఐ కింద దరఖాస్తు చేశారు. ఆ సమాచారం తమ కార్యాలయంలో లేదని ఉప తహశీల్దార్ అదే ఏడాది అక్టోబర్‌లో తెలియజేశారు. దేశపాత్రునిపాలెం డిఆర్ ఫైల్స్ నఖలు కోసం తాను 2676 రూపాయలను పరవాడ తహశీల్దార్ కార్యాలయానికి గతేడాది డిసెంబరు 18న చెల్లించినప్పటికీ ట్యాంపరింగ్ జరిగిన కాలంలోని వివరాలు ఇవ్వలేదని మోహన్‌రావు తెలిపారు ఇదిలావుండగా ఈ నెల 20న 'ప్రజాశక్తి'లో 'దేశపాత్రునిపాలెంలో భూ మాయ' అని, 21న 'ప్రభుత్వ భూమికి రెవెన్యూ ఎసరు' అని వచ్చిన కథనాలపై పరవాడ తహశీల్దార్ గణపతిరావు స్పందిస్తూ ప్రభుత్వ భూమి ఆక్రమణలపై సిట్‌కు నివేదించామని, ఆ అధికారుల నుంచి ఆదేశాలు రావాల్సివుందని పేర్కొన్నారు. లోకాయుక్త, హైకోర్టు, దిగువ కోర్టులో కేసులు పెండింగ్‌లో వున్నాయని, న్యాయస్థానాల తుది తీర్పునకు లోబడి తగు చర్యలు తీసుకుంటామని ఆదివారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు.

గ్రేటర్‌లో వైసిపికి షాక్

(మొదటి పేజీ తరువాయి..) పూర్ణిమ వైసిపిలో చేరారు. ఈ ఏడాది మే నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో దక్షిణ నియోజవర్గం నుంచి జనసేన అభ్యర్థిగా పోటీ చేసిన సిహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ అంతకుముందు 21వ వార్డు వైసిపి కార్పొరేటర్‌గా ఉండేవారు. ఆయన రాజీనామా చేసి జనసేనలో చేరారు. ఈ సమీకరణల నేపథ్యంలో కౌన్సిల్‌లో అధికార వైసిపి బలం 58కి తగ్గింది. ఇప్పుడు 12 మంది కార్పొరేటర్లు టిడిపి, జనసేన పార్టీలలో చేరడంతో వైసిపి బలం 46కి పడిపోయింది. టిడిపి బలం 37కు, జనసేన బలం 10కి పెరిగింది. కూటమిలో భాగస్వామిగా ఉన్న బిజెపికి కూడా జివిఎంసిలో ఒక కార్పొరేటర్ ఉన్నారు. అదీ కలిస్తే కౌన్సిల్లో కూటమి బలం 48కి చేరుతుంది. ఈ లెక్కన చూస్తే కౌన్సిల్‌లో వైసిపి కంటే కూటమికి ఇద్దరు కార్పొరేటర్లు అధికంగా ఉన్నట్లే.

పావులు కదుపుతున్న కూటమి : చట్టం వల్ల కొద్ది నెలలు వేచి చూడాల్సిందే..

మొత్తం ఈ వ్యవహారాన్ని గమనిస్తే జివిఎంసిపై కూటమి జెండా ఎగురనుందన్న విషయం అర్థమవుతోంది. మేయర్, డిప్యూటీ మేయర్‌లపై అవిశ్వాసం పెట్టి ఆ పదవులను కూడా కైవసం చేసుకోవాలని, స్టాండింగ్ కౌన్సిల్‌లో ఆధిపత్యం సాధించాలని కూటమి నాయకుల ఆలోచనగా ఉంది. అయితే మేయర్, డిప్యూటీ మేయర్‌లపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు చట్టం అనుమతించదు. పాలకవర్గం ఏర్పడిన నాలుగు సంవత్సరాలు పూర్తి అయితే తప్ప మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశం లేదు. వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ప్రారంభంలోనే ఆ చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టం ప్రకారం చూస్తే ప్రస్తుతం జివిఎంసిలో అధికారంలో ఉన్న వైసిపి మేయర్ పదవీకాలం మూడు సంవత్సరాల నాలుగు మాసాలు పూర్తి అయ్యింది. మరో ఎనిమిది మాసాలు పూర్తయితే తప్ప అవిశ్వాసం పెట్టే అవకాశం లేదు. అయితే ఈలోగా స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో కూటమి ఆధిపత్యం సాధించడం తథ్యం. జివిఎంసిలో ఏదైనా అభివృద్ధి పనులు ప్రతిపాదించాలన్నా, వాటిని అమలు చేయాలన్నా, అందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలన్నా స్టాండింగ్ కౌన్సిల్ తీర్మానాలు ముఖ్యం. అదే సందర్భంలో ప్రస్తుత పాలకవర్గం స్టాండింగ్ కౌన్సిల్‌లో చేసిన పలు అభివృద్ధి పనులను రద్దు చేసే అవకాశం కూడా కొత్తగా ఎన్నికయ్యే స్టాండింగ్ కౌన్సిల్‌కు ఉంటుంది. అందుకే ముందుగా స్టాండింగ్ కౌన్సిల్‌ను కైవసం చేసుకొని, ఆ తర్వాత మేయర్ పదవిని కూడా పొందాలని కూటమి నాయకుల అభిప్రాయంగా ఉంది.

వసతి గృహాల్లో సౌకర్యాలు భేష్

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు - 'ప్రజాశక్తి'తో అనకాపల్లి జిల్లా బిసి సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజేశ్వరి





ప్రజాశక్తి - అనకాపల్లి

జిల్లాలోని వసతి గృహాల్లో సౌకర్యాలు మెరుగ్గా ఉన్నాయని, ప్రగతి దిశలో వసతి గృహాలు పయనిస్తున్నాయని అనకాపల్లి జిల్లా బిసి సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రాజేశ్వరి తెలిపారు. జిల్లాలో వసతి గృహాల్లో పరిస్థితులు, విద్యార్థులకు అందిస్తున్న సేవలు, సాధించిన ప్రగతిని ఆమె 'ప్రజాశక్తి'కి వివరించారు. ఆ విషయాలు ఆమె మాటల్లోనే..

జిల్లాలో బిసి వసతి గృహాలు ఎన్ని ఉన్నాయి ? విద్యార్థులు ఎంత మంది ఉన్నారు ?

అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, యలమంచిలి డివిజన్లలో బీసీ ప్రీమెట్రిక్ హాస్టల్స్ బాలురు కోసం 30, బాలికల కోసం 9 మొత్తం 39 హాస్టల్స్ ఉన్నాయి. అలాగే పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్ బాలురు కోసం ఆరు, బాలికల కోసం ఆరు ఉన్నాయి. ప్రీ మెట్రిక్ హాస్టల్స్‌లో 4400 సీట్లు, పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్‌లో 1200 సీట్లు ఉన్నాయి. అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసు అనకాపల్లిలో ప్రీ మెట్రిక్ 981 మంది, చోడవరంలో 750 మంది, నర్సీపట్నంలో 1252 మంది, యలమంచిలిలో 336 మంది వెరసి మొత్తం 3319 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో బీసీలు 2472 మంది, ఎస్సీలు 118, ఎస్టీలు 634, ఈబీసీలు 95 మంది ఉన్నారు. అలాగే పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు అనకాపల్లి, చోడవరం, వి.మాడుగుల, కె.కోటపాడులో ఉన్నాయి. వీటిలో బీసీలు 433, ఎస్సీలు 17, ఎస్టీలు 17 మంది కలసి మొత్తం 467 మంది విద్యార్థులు ఉన్నారు.

2023 -24లో పదో తరగతిలో సాధించిన ప్రగతి ఎలా ఉంది ?

2023 -24 విద్యా సంవత్సరంలో అనకాపల్లి, నర్సీపట్నం, యలమంచిలి, చోడవరంల్లో ఉన్న 39 హాస్టల్స్‌లో చింతనిప్పుల అగ్రహారం హాస్టల్ మినహా 611 మంది విద్యార్థులకుగాను 518 మంది హాజరయ్యారు. సగటున 84.77 శాతం విద్యార్థులు పాసయ్యారు. వీటిలో శత శాతం ఫలితాలు సాధించిన వాటిలో గోవాడ, గొలుగొండ, కోటవురట్ల, రోలుగుంట, తురువోలు, అప్పలరాజుపురం, దేవరాపల్లి ప్రభుత్వ బిసి బాయ్స్ హాస్టల్స్, చీడికాడ బిసి గర్ల్స్ హాస్టల్ ఉన్నాయి.

ప్రభుత్వ భవనాలు ఎన్ని ఉన్నాయి ? ప్రైవేటు భవనాల్లో ఎన్ని నడుస్తున్నాయి ?

జిల్లాలో మొత్తం 39 హాస్టల్స్‌లో 23 బాలుర వసతి గృహాలు, ఆరు బాలికల వసతి గృహాలు ప్రభుత్వ భవనాల్లో ఉండగా, ఆరు బాలుర, మూడు బాలికల హాస్టల్స్ అద్దె భవనాల్లో నడుస్తున్నాయి, అలాగే ఒక హాస్టల్ రెంటు ఫ్రీగా నడుస్తోంది. అలాగే పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్ మూడు బాలుర, ఒకటి బాలికల వసతి గహాలు ప్రభుత్వ భవనాల్లో నడుస్తుండగా.. అద్దె భవనాల్లో ఐదు బాలుర, మూడు బాలికల హాస్టల్స్ ఉన్నాయి.

కాస్మోటిక్ ఛార్జీలు ఎలా చెల్లిస్తున్నారు ?

ప్రీ మెట్రిక్ విద్యార్థులు మూడు నుంచి ఆరు తరగతుల వారికి బాలురుకు 125 రూపాయలు, బాలికలకు 130, ఏడు నుంచి పదో తరగతి వారికి 150 రూపాయలు, బాలికలకు 200 రూపాయలు చెల్లిస్తుండగా డైట్ చార్జీలు మూడు, నాలుగు తరగతుల వారికి 1150, ఐదు నుంచి పదో తరగతి వారికి 1400 రూపాయలు చెల్లించడం జరుగుతుంది.

మరమ్మతులకు గురైన హాస్టల్ భవనాలను అభివృద్ధి పరిచారా ?

అనకాపల్లి నూతన జిల్లాగా ఆవిర్భవించిన కాలంలో జిల్లాలో పలు హాస్టల్స్ మరమ్మతుల స్థాయిలో ఉన్నాయి. వీటిని కలెక్టర్ సహకారంతో 98 లక్షల సిఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పరిచాం. 13 హాస్టల్స్‌ను అభివృద్ధి చేయాల్సి ఉంది.

ప్రభుత్వం నుంచి రావలసిన బకాయిలు ఉన్నాయా ?

ప్రభుత్వం నుంచి 2023 సెప్టెంబర్ నుంచి బిల్లులు రావాల్సి ఉంది. అందుకుగాను ప్రభుత్వానికి తరచూ తెలియపరుస్తున్నాం.

IN THE HONOURABLE COURT OF THE VII SPECIAL METROPOLITAN MAGISTRATE AT VISAKHAPATNAM
C.C.No. 3374 / 2023

Between:
M/s. Ashritha Sai Enterprises,
Rep by its Managing Partner
Mr. Paruchuri Srinivasa Rao
...Petitioner / Complainant
And
M/s. Sri Jayadurga Enterprises
Rep b Mangaraju Janardhana Rao
...Respondent / Accused
TO
M/s. Sri Jayadurga Enterprises
Rep by Mangaraju Janardhana Rao
D.No. 7-161, Near Shriram Chits Office,
Madhurawada,
Visakhapatnam-530048

పబ్లికేషన్ (ప్రకటన)

పై నెంబరు దావాలో మీరు ప్రతివాది అయ్యి ఉన్నారు. మీరు పైన తెలిపిన వాది వద్దనుండి తీసుకున్న సొమ్ము నక్రమంగా చెల్లించకపోవడం వలన సదరు పైన తెలిపిన వాది మీ పై పైన తెలిపిన కోర్టులో పైన తెలిపిన కేసును దాఖలు చేసి యున్నారు, సదరు కేసులో మీపై ఎన్నిసార్లు నోటీసు పంపిననూ మీరు అందుకో నందున, సదరు కోర్టువారు మీ పై పేపర్ పబ్లికేషన్ ద్వారా నోటీసుయిచ్చుటకు ఆర్డరు చేసియున్నందున, మీరు **తే.09-08-2024** దిన సదరు కోర్టువారి ముందు **ఉదయం 10:30 గం॥లకు** వ్యక్తిగతంగా గాని, మీ తరుపు న్యాయవాది గారి ద్వారా గాని హాజరయ్యి మీకు గల వాదోపవాదనలు మరియు ఆక్షేపణలు అభ్యంతరంలు తెలియపరచుకోవలసిందిగా కోరడమైనది. లేని యెడల ఈ పరోక్షమున తీర్మాణము జరుపబడును.

Koduri Sreenivasa Rao
Advocate, VISAKHAPATNAM
విశాఖపట్నం
తేది. 20-07-24 **Cell : 9885166648**

భీమునిపట్నం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి భీమునిపట్నం కోర్టు భీమునిపట్నం
E.P.No.53/2023 in O.S. 174/2021

Between:
Dasari Sridhar . . . డిక్రీహోల్డర్/వాది
And:
Smt. Patnal Padmavathi
. . . జడ్జిమెంటు డెటార్

వేలం ప్రకటన

పై నెంబరు దావాలో అమలు పిటిషన్ అమలు మొత్తం సొమ్ము రూ.6,46,081.00లు (ఆరు లక్షల నలభైఆరువేల ఎనిబది ఒక్క రూపాయి మాత్రమే) ఇందలి JDR నుండి రాబట్టుటకు, JDRకు సంపూర్ణ హక్కు అనుభవములోయున్న క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని శ్రీకోర్టు వారు **తే: 06-08-2024న ఉదయం గం. 10-30** ని॥లకు వేలం వేయుటకు నిర్ణయించినారు. కావున సదరు వేలంలో పాల్గొనదలచిన వారు పైన వివరించిన తేది, సమయంలో పై శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై సదరు కోర్టు వారు వేసిన నిబంధనలు ప్రకారము వేలంలో పాల్గొనగలరు.

వేలం ఆస్తి షెడ్యూలు

విశాఖపట్నం జిల్లా, భీమునిపట్నం సబురి, తాలూకా గ్రేటర్ విశాఖ నగర పాలక సంస్థ ఏరియాలో చేరిన భీమునిపట్నం గ్రామము తాలుకా, సర్వేనెం. 1095, బ్లాకు నెం.13, వార్డు నెం. 22, యూత్‌వీధితో గల 376 చ॥గ॥లు లేక 314.384 చ॥మీ॥లు స్థలయు అందలి డో.నెం. 14-13-36రు, అసెస్‌మెంటు నెం. 1089001136రు, కరెంటు మీటరు నెం. 00396రు కలిగిన మొత్తం ఆస్థిలో పడమర బాగం 242.68 చ॥గ॥లు లేక 202.900 చ॥మీ॥లు స్థలం అందరి 200 చ॥అ॥లు రేకుల యింటికిహద్దులు

తూర్పు: డిఫెండెంటు డాబా యిల్లు
దక్షిణం : రోడ్డు
పడమర : రోడ్డు
ఉత్తరం : యితరుల తాలూకు స్థలం
DHR విలువ : రూ. 20,00,000/-
కోర్టు అమీను విలువ : రూ. 50,00,000/-
JDR విలువ : యివ్వలేదు.

తట్టికోట శ్రీనివాసరావు
న్యాయవాది, భీమునిపట్నం.
సెల్: 98661 43440, 89856 47440

IN THE HONOURABLE COURT OF THE III ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
O.S 1183/2023

Between:
Mr Yaganti Rajarao **...Plaintiff**
And
Mr Bojja Gangadhara Rao
...Defendant
TO
Mr Bojja Gangadhara Rao, S/o Bojja Mahalakshmi (late), Hindu, aged 64 years, residing at D.No.20-97, Bharat Nagar, Near Simhadri Hospital Back Side, Prahladapuram, Gopalapatnam, Visakhapatnam.

పబ్లికేషన్ (ప్రకటన)

పై నెంబరు దావాలో మీరు ప్రతివాది అయ్యి ఉన్నారు. మీరు పైన తెలిపిన వాది వద్దనుండి తీసుకున్న సొమ్ము నక్రమంగా చెల్లించకపోవడం వలన సదరు పైన తెలిపిన వాది మీ పై పైన తెలిపిన కోర్టులో పైన తెలిపిన కేసును దాఖలు చేసి యున్నారు, సదరు కేసులో మీపై ఎన్నిసార్లు నోటీసు పంపిననూ మీరు అందుకో నందున, సదరు కోర్టువారు మీ పై పేపర్ పబ్లికేషన్ ద్వారా నోటీసుయిచ్చుటకు ఆర్డరు చేసియున్నందున, మీరు **తే.23-08-2024** దిన సదరు కోర్టువారి ముందు **ఉదయం 10:30 గం॥లకు** వ్యక్తిగతంగా గాని, మీ తరుపు న్యాయవాది గారి ద్వారా గాని హాజరయ్యి మీకు గల వాదోపవాదనలు మరియు ఆక్షేపణలు అభ్యంతరంలు తెలియపరచుకోవలసిందిగా కోరడమైనది. లేని యెడల ఈ పరోక్షమున తీర్మాణము జరుపబడును.

Koduri Sreenivasa Rao
Advocate, VISAKHAPATNAM
విశాఖపట్నం **Cell : 9885166648**
తేది. 20-07-2024

పబ్లిక్ నోటీసు

నా క్లయింట్ అయిన శ్రీ తుమ్మగంటి శ్రీనివాసరావు S/o లేట్ నారాయణ, శ్రీమతి తుమ్మగంటి సుజాతాదేవి W/o శ్రీనివాసరావు గార్లు ఇచ్చిన భోగట్టా ప్రకారం...

శ్రీకాకుళం జిల్లా, జలుమూరు మండలం, చల్లవానిపేటకు చెందిన నిక్కు నారాయణరావు S/o సింహాచలం, పంగ రంజిత W/o నిక్కు నారాయణరావులకు చెందిన సంపూర్ణ హక్కు భుక్తములు కలిగిన ఈ క్రింది షెడ్యూల్ ఆస్తిని విక్రయించుటకు ఒప్పందం చేసుకొనడమైనది.

ఈ క్రింది ఆస్తిపై తనఖాలు గాని, కోర్టు కేసులు గాని, వారసత్వ హక్కులు గాని, బ్యాంకు ఆర్థిక సంస్థల రుణములు గాని, మరియు ఏ విధమైన అభ్యంతరములు ఉన్న యెడల 7 రోజులలో వాటిని రాతపూర్వకంగా తగిన ఆధారములతో ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములు నా క్లయింటును మరియు ఆస్తిని బైండ్ చేయవని, తదనంతరం నిర్వివాద నిష్పేచీగా భావించి నా క్లయింటు కొనుగోలు చేయుదురని తెలియజేయడమైనది.

ఆస్తి షెడ్యూలు

గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వెంకటాపురం గ్రామం నందు గోపాలపట్నం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు ప్రాంతంలోని శాంతినగర్ ఏరియాలో చేరి S.No.157/AP LRC స్కెచ్, S.No. 157/Aలో ఉన్న 163, 164 ప్లాటుల్లో గాయత్రి ఎన్‌క్లేవ్ పేరిట నిర్మించిన భవనంలోని మూడో అంతస్తులోని డోర్ నెంబరు : 5-30/18 (TF-403) లో వెయ్యి అడుగులు విస్తరించి, అవిభాజ్యపు స్థలంనందు 28.77 చదరపు అడుగులు (24.055 చదరపు మీటర్లు), 60 అడుగుల కారు పార్కింగు సదుపాయం కలిగిన 403వ నెంబరు ప్లాటుకు క్రింది హద్దులు కలవు.

తూర్పు : ఓపెన్ కారిడార్ & స్టెయిర్ కేస్
దక్షిణ : ఓపెన్ సెట్‌బ్యాక్ స్పేస్
పడమర : ఓపెన్ సెట్‌బ్యాక్ స్పేస్
ఉత్తర : ఫ్లాట్ నెం : 402

K. Sankar
Advocate
Visakhapatnam
Cell : 98489 55228

Visakhapatnam
Date: 21.7.2024

చినుకు పడితే మురుగుతో చిక్కులు

- కాలువల్లోంచి రోడ్డెక్కి ప్రవహిస్తున్న నీరు
- వాహన రాకపోకలకు ఆటంకం



అండర్ పాత్ వే వద్ద నదిలా పొంగి పొర్లుతున్న వర్షపు నీటిలో వాహన రాకపోకలు ఇలా..

ప్రజాశక్తి -తగరపువలస : హైవే విస్తరణ పనుల్లో శాస్త్రీయత లేకపోవడం, నిర్మాణంలో నాణ్యతా లోపంతో చిన్న పాటి వర్షం కురిసినా కాల్వల్లోకి వెళ్లాల్సిన మురుగు నీరు, అటు నుంచి ఇటు రోడ్డెక్కి ఉధృతంగా ప్రవహిస్తూ ప్రజలు, వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తోంది. జాతీయ రహదారికి అనుకుని ఉన్న జివిఎంసి రెండో వార్డు పరిధి ఆవల కొండప్ప చెరువుకు ఆనుకుని ఉన్న అల్లూరి సీతారామరాజు కాలనీ వాసులు, ఇవతల సబ్బివాని వీధి ప్రాంత నివాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వీరే కాకుండా హైవే అండర్ పాత్‌కు అవతల, ఇవతల రెండు వైపులా సర్వీస్ రోడ్డు గుండా గత రెండ్రోజులుగా కురిసిన వర్షాలకు చెరువును తలపించేలా వర్షపు నీరు పొంగి పొర్లుతోంది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు వర్షపు నీరు పొంగి పొర్లడంతో విశాఖ నుంచి తగరపువలస, తగరపువలస నుంచి విశాఖ వైపు వెళ్తూ, వచ్చే ఆటోలు, కార్లు, జీపులు, ద్విచక్ర వాహనాలు, ఆర్టీసీ బస్సుల రాకపోకలకు ఆటంకం కలిగింది. వర్షాలు ఇలానే మరో మూడు రోజులు కురిస్తే సమీపంలోని పల్లపు ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులకు గురికావల్సివస్తుంది. సహజంగా ఇది పల్లపు ప్రాంతం కావడం, దీనికి తోడు హైవే నిర్మాణం, విస్తరణ సమయంలో దొర్లిన సాంకేతిక పరమైన కొన్ని తప్పిదాలు వర్షపు నీరు బయటకు వెళ్లలేని పరిస్థితి తలెత్తిందని చెప్పక తప్పదు.

రోడ్డుపై ప్రవహించే నీరు బయటకు వెళ్లేలా శాస్త్రీయంగా కాల్వల నిర్మాణం జరగలేదని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఏది ఏమైనా వర్షపు నీరు రోడ్డుపై నిల్వ ఉండకుండా బయటకు పోయేలా జివిఎంసి అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. నీటి పారుదల శాఖ, జివిఎంసి, హైవే అథారిటీ అధికారులు సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడితే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించగలదని స్థానికులు అంటున్నారు. ఇది ఇప్పటికిప్పుడే ఏర్పడిన సమస్య కాదు. జాతీయ రహదారి పనులు పూర్తయిన నాటి నుంచి ఇదే పరిస్థితి.

తల నొప్పిగా మురుగు నీటి సమస్య..

జాతీయ రహదారి విస్తరణలో రోడ్డుకు ఆనుకుని ఇరువైపులా కాల్వల నిర్మాణం, వాటిపై వేసిన సిమెంట్ పలకల నిర్మాణ లోపం, ముందు చూపు లేకుండా చేపట్టిన పనులు వల్ల తలెత్తిన మురుగు నీటి కష్టాలు ఇటు ప్రజలతో పాటు, జివిఎంసి యంత్రాంగానికి తల నొప్పిగా మారింది. హైవే అధికారుల్లో కొంతమంది అనాలోచిత నిర్ణయాలకు జనం ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిసిన ప్రతి సందర్భంలోనూ నీటి మళ్లింపునకు ఒకటో జోన్ జివిఎంసి అధికారులతో పాటు పారిశుధ్య యంత్రాంగం, కార్మికులు శ్రమించాల్సి వస్తోంది. పెరుగుతున్న పట్టణ జనాభా, వారి అవసరాలకు అనుగుణంగా ప్రణాళికా బద్ధంగా రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టి ఉంటే ఈ తరహా కొత్త సమస్యలు ఉత్పన్నం కావని స్థానికులు అంటున్నారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు



లారీ డ్రైవర్‌ను బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్న స్థానికులు

ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొట్టిన లారీ

క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్

ప్రజాశక్తి -గాజువాక : అక్కిరెడ్డిపాలెంలోని జాతీయ రహదారిలో ఆగి ఉన్న టిప్పర్‌ను లారీ ఢీకొట్టడంతో డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. ఆదివారం సాయంత్రం జరిగిన ఘటనకు సంబంధించి స్థానికుల కథనం ప్రకారం... విశాఖ ఎన్ఎడి వైపు నుంచి గాజువాక లోడుతో వచ్చిన ఒక లారీ అక్కిరెడ్డిపాలెం జాతీయ రహదారిపై మరమ్మతుకు గురై నిలిచిపోయింది. అదే రోడ్డులో ఎన్ఎడి వైపు నుంచి మరో లారీ ఖాళీగా వస్తూ అదే ప్రాంతంలో అడ్డుగా వచ్చిన కారును తప్పించబోయి ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. దీంతో లారీ క్యాబిన్ నుజ్జు అయింది. ఈ ప్రమాదంలో డ్రైవరు క్యాబిన్‌లో ఇరుక్కుపోయి రెండు కాళ్లు విరిగిపోయాయి. క్రేన్ సహాయంతో డ్రైవర్‌ను బయటికి తీయడానికి మూడు గంటల సమయం పట్టింది. ఈ లోగా డ్రైవరు 'నన్ను రక్షించండి' అంటూ పెట్టిన ఆర్తనాదాలు అందరినీ కంట తడి పెట్టించింది. జాతీయ రహదారిపై ప్రమాదం జరగడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. సాయంత్రం నాలుగు గంటలకు ప్రమాదం జరిగిన నుంచి 7 గంటల వరకు షీలానగర్ నుంచి పాత గాజువాక జంక్షన్ వరకు వాహనాలు నిలిచిపోయాయి. ఏడు గంటల తర్వాత ట్రాఫిక్ క్లియర్ అయింది.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి -మధురవాడ : పోతినమల్లయ్యపాలెం పోలీసు స్టేషన్ పరిధిలోని యువతి అదృశ్యమైనట్లు సిఐ వై.రామకృష్ణ తెలిపారు. సిఐ కథనం ప్రకారం... జివిఎంసి 6వ వార్డు పరిధిలోని సాయిప్రియ గార్డెన్స్‌కు చెందిన యువతి వాసవి ఈ నెల 20వ తేదీ సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లేకపోవడంతో యువతి తండ్రి రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు.

14 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:గంజాయిని అక్రమంగా తరలిస్తున్న గొలుగొండ గ్రామానికి చెందిన మైనర్ యువకుడిని అరెస్టు చేసినట్లు నర్సీపట్నం రూరల్ ఎస్సై భీమరాజు తెలిపారు. గొలుగొండ మండలం అదే గ్రామానికి చెందిన మైనర్ పదో తరగతి చదివి మానేశాడన్నారు. విశాఖ ఏజెన్సీ నుంచి 14 కేజీల గంజాయి కొనుగోలు చేసి తరలిస్తుండగా ధర్మసాగరం జంక్షన్ వద్ద అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఉచిత హోమియో వైద్యశిబిరం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యాన చిన్న బజారులోని సంస్థ కార్యాలయం వద్ద ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి హోమియో వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు టి.జగన్నాథరావు, టిజి.మోహన్ సుమారు వంద మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ ప్రతినిధులు కెఎస్ఎన్.మూర్తి, కె.చంద్రశేఖర్, కెవి.భానోజీ రావు, సభ్యులు వి.లక్ష్మణరావు, వి.శ్రీనివాసరావు, వి.తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల స్వైరవిహారం

ఆందోళన చెందుతున్న స్థానికులు

ప్రజాశక్తి-తగరపువలస : స్థానిక చిట్టివలస ప్రైవేట్ ఫంక్షన్ హాల్, సినిమా థియేటర్, బంగ్లా మెట్ట, ఆదర్శ నగర్, బాలాజీ నగర్ తదితర ప్రాంతాల్లో వీధి కుక్కల బెడద కొద్ది రోజులుగా ఎక్కువగా ఉంది. నడిచి వెళ్లే వారిపైన, ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారిని వెంబడిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. భీమిలి రోడ్డులో శనివారం రాత్రి ఇద్దరు కుక్క కాటుకు గురయ్యారని స్థానికులు చెబుతున్నారు. వీటి నియంత్రణకు జివిఎంసి అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అన్నదానం

ఆనందపురం : మండలంలోని పందలపాక పంచాయతీలో పోతిన గోవిందరావు ఆధ్వర్యాన 1500 మందికి అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో మజ్జి వెంకట్రావు, అర్చకులు ఆనందరావు, ఆలయ ధర్మకర్త జి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని రేవళ్లపాలెం బాధితుల వినతి



ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న రేవళ్లపాలెం బాధితులు

ప్రజాశక్తి -పిఎం.పాలెం : జివిఎంసి ఆరో వార్డు పరిధి రేవళ్లపాలెం రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి న్యాయం చేయాలని స్థానిక టిడిపి నేతలు నాగోతి వెంకట్రావు, పోతిన శ్రీనివాసరావు ఆధ్వర్యాన బాధితులు ఆదివారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును వినతి పత్రం అందజేశారు. ఇటీవల రేవళ్లపాలెంలో 80 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డు విస్తరణలో భాగంగా 32మంది తమ నివాసాలను కోల్పోయారని, భూములు కోల్పోయినందుకు 1:4వ వంతు టిడిఆర్ నష్ట పరిహారాన్ని గత ప్రభుత్వం అందిస్తూ బిల్డింగ్ కాంపన్‌సేషన్ ఇస్తామని నమ్మించి నిర్మాణాలను ఏడాది క్రితం తొలగించారని వివరించారు. వారిచ్చిన బిల్డింగ్ కాంపన్‌సేషన్ తమ ఇంటి అద్దెలకే సరిపోలేదని తెలిపారు. బాధితులకు ఏటువంటి నష్ట పరిహారాన్నీ అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించి టిడిఆర్, నివాసం కోసం టిడ్కో ఇల్లు మంజూరు చేయాలని గంటా శ్రీనివాసరావును కోరారు. ఈ కార్యక్రమంలో పిళ్లా రమణ, బాధితులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా వ్యవస్థాపక దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న బ్యాంకు మేనేజర్ తదితరులు

ప్రజాశక్తి -ఆనందపురం : మండల పరిధి వేములవలసలోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో 117వ వ్యవస్థాపక దినోత్సవాన్ని బ్యాంక్ మేనేజర్ సిరిపురపు రామనాయుడు ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా కస్టమర్లకు 100 మొక్కలను అందజేశారు. అనంతరం మేనేజర్ రామనాయుడు మాట్లాడుతూ, కస్టమర్లకు నాణ్యమైన సేవలను అందించడంలో భారతదేశంలోనే రెండో స్థానంలో బ్యాంక్ ఆఫ్ బరోడా నిలిచిందన్నారు. రైతు రుణాలు, బంగారు రుణాలు, ముద్రలోన్లు, ఇంటిపై లోన్లు తదితర రుణాలను తక్కువ వడ్డీకి అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్తలు చెన్న వెంకటేష్, ప్లైవుడ్ నాయుడు, కోన శ్రీను, పవనపుత్ర అధినేత మణికంఠ, బ్యాంక్ అకౌంటెంట్ కామేశ్వరరావు, గోల్డ్ లోన్ ఆచారి బ్రహ్మాజీ, సిబ్బంది ధనంజయ, పరిమళ, సమంత, కుమారి, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన భూ బాధితుల ఆందోళన

ప్రజాశక్తి- పిఎం పాలెం : కొమ్మాది, బక్కన్నపాలెం, రేవళ్లపాలెం రైతులు తమకు నష్ట పరిహారంగా ఇస్తామన్న ఇళ్లను వెంటనే ఇవ్వాలని కోరారు. ఆదివారం వర్షాన్ని సైతం లెక్క చెయ్యకుండా బాధితులు బక్కన్నపాలెం నవోదయ విద్యాలయం వద్ద ఉన్న హుదూద్ ఇళ్ల ముందు ధర్నా కొనసాగించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, భూములు కోల్పోయిన రైతులకు ఇళ్లు ఇస్తామని అధికారులు,ప్రజా ప్రతినిధులు ఇచ్చిన మాటను నిలబెట్టు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దలు బి.పోతురాజు, ఎస్.పైడి, కెపిఎస్ నాయకులు ఎస్.పైడితల్లి, రైతులు శేయాద్రిరాజు, ఎస్.నాగేశ్వర్, బి.అప్పారావు, ఎస్.కాంతం, నరసియ్యమ్మ, గురయ్య, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



ఆందోళన కొనసాగించిన భూ బాధితులు



రక్తదానం చేస్తున్న యువకులు

80 మంది రక్తదానం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక సన్ స్కూల్ ప్రాంగణంలో విశాఖ బ్లడ్ సెంటర్ సహకారంతో, నీడీ వెల్ఫేర్ అసోసియేషన్, యరబాల ఛారిటీ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 80 మంది రక్త దానం చేశారు. రక్తదానం చేసిన వారిలో భీమిలి నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.శ్రీనివాస్, యరబాల ఛారిటీ సభ్యులు ఉన్నారు. విశాఖ బ్లడ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.యుగంధర్, సిబ్బంది రామ రవిశంకర్ సేవలు అందించారు. బిఎన్‌డబ్ల్యు అసోసియేషన్ సభ్యులు డాక్టర్ ఎన్.ఎల్.రావు, గంటా నూకరాజు, ఎం.సూర్యశ్రీనివాస్, కాళ్ల సన్నీ, యరబాల ఛారిటీ చైర్మన్ యరబాల అనిల్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. రక్తదానం చేసిన వారిని అభినందిస్తూ హోటల్ బ్లిస్ ఎమ్‌డి లక్ష్మీలావణ్య బహుమతులు అందజేశారు.

రేకుల షెడ్‌లోనే క్రైం స్టేషన్

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రజలకు రక్షణ కల్పిస్తున్న పోలీసులు వర్షం వస్తే ఆందోళన చెందే పరిస్థితి నగరంలోని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకుంటోంది. భద్రత పరంగా పటిష్టంగా ఉండాల్సిన స్టేషన్ కాస్త ఏళ్ల తరబడి రేకుల షెడ్‌లోనే మిగిలిపోయింది. నగరానికి ఎందరు పోలీస్ కమిషనర్లు వచ్చి వెళ్తున్నా ఈ స్టేషన్ పరిస్థితి మారడం లేదు. సిబ్బంది తమ వెతలను బయటకు చెప్పుకోలేక ఇబ్బందులు పడుతూ విధులు నిర్వహిస్తున్నారు. ఈ స్టేషన్‌లో ఎస్ఐతో పాటు సుమారు 20 మందికిపైగా సిబ్బంది ఉన్నారు. ఉన్నతాధికారులు వచ్చినప్పుడు సమావేశాలు పెట్టుకోవడానికి స్థలం చాలక ఆరుబయట నిర్వహిస్తుంటారు. స్టేషన్ పరిధి పెద్దది కావడంతో కేసులు సంఖ్య అధికంగా ఉంటున్నాయి. పలు కీలక కేసుల్లో దొంగలను పట్టుకొని అరెస్టు ప్రక్రియ జరిగి న్యాయస్థానంలో హాజరుపరిచేంతవరకు పోలీసులే బాధ్యత వహించాల్సి ఉంటుంది. రాత్రి సమయంలో అనుమానాస్పద వ్యక్తులను స్టేషన్‌కు తీసుకొస్తుంటారు. వారిని ఉంచడానికి స్టేషన్లో స్థలం లేకపోవడం సిబ్బందికి తలనొప్పిగా మారింది. ఇలా పట్టుబడిన వారిని సిసిఎస్ స్టేషన్ పరిధిలో ఉంచక తప్పడం లేదు. వారు పొరపాటున తప్పించుకుంటే ఉద్యోగాలు పోతాయన్న భయమూ ఆ పోలీసులను వేధిస్తోంది. ఇటీవలే గాలివానకు షెడ్డుపై చెట్టు విరిగిపడి రేకులు దెబ్బతిన్నాయి. సిబ్బంది చిన్నపాటి మరమత్తులు నిర్వహించుకున్నారు. స్టేషన్‌లో మరుగుదొడ్లు కూడా లేవు. స్టేషన్ సిబ్బందిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వారు ఎక్కడికెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొంది. విధులకు వచ్చిన నుంచి వెళ్లేంతవరకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం మరుగుదొడ్డి సౌకర్యమైనా కల్పిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.


రేకుల షెడ్‌లో ఉన్న క్రైం పోలీసు స్టేషన్ ఇదే...

వైసిపి కార్పొరేటర్ల చేరికను
వ్యతిరేకిస్తున్న స్థానిక టిడిపి నేతలు

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి పరిధిలో పలువురు వైసిపి కార్పొరేటర్లు ఆదివారం టిడిపి చేరడాన్ని స్థానిక తెలుగుదేశం నాయకులు వ్యతిరేకిస్తున్నారు. జివిఎంసి 65వ వార్డు వైసిపి కార్పొరేటర్‌గా ఉన్న బొడ్డు నరసింహ పాత్రుడు (కేబుల్ మూర్తి) ప్రస్తుతం తెలుగుదేశంలో చేరారు. కేబుల్‌మూర్తి రాకను తెలుగుదేశం వార్డు అధ్యక్షులు రట్టి వాసు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. గతంలో కేబుల్ మూర్తి కబ్జాలపై వాసు అనేక ఫిర్యాదులు చేసి ఉన్నారు. అదే కార్పొరేటర్ ఇప్పుడు టిడిపిలో రావడాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు వద్ద తన ఆవేదన తెలియజేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు టిడిపిలో చేరడాన్ని వార్డులోని జనసేన నాయకుడు కర్ణం కనకారావు, టిడిపి నాయకుడు పప్పు రాజారావు వ్యతిరేకిస్తున్నారు. పార్టీలో చేరినప్పటికీ రాజాన రామారావుకు ప్రాధాన్యత లభించకుండా చూడాలని వీరు ప్రయత్నాలు చేస్తున్నారు. భవిష్యత్తులో వీరు ఏ విధంగా ముందుకు సాగుతారు వేచి చూడాల్సి ఉంది.


ఎంపీ శ్రీభరత్‌కు వినతిపత్రం అందిస్తున్న పెన్షనర్లు

పెన్షనర్ల సమస్యలపై ఎంపీకి వినతి

ప్రజాశక్తి -ములగాడ : ఇపిఎఫ్-95 పెన్షనర్లు తమ సమస్యలపై విశాఖ ఎంపీ శ్రీభరత్‌ను ఆదివారం టిడిపి కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. సమస్యలను ఎంపీకి వివరించారు. ఈ సమస్యలపై అధికారులతో మాట్లాడతానని ఎంపీ శ్రీభరత్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పులి రమణారెడ్డి, దీనబంధు, ఎస్.కె.హుస్సేన్, కె.అప్పలరాజు పాల్గొన్నారు.


సింహగిరికి వెళ్తున్న భక్తులు


సింహగిరికి పోటెత్తిన భక్తజనం
ఆఖరి విడత చందన సమర్పణ పూర్తి

ప్రజాశక్తి-సింహాచలం : గిరిప్రదక్షిణ చేసిన లక్షల మంది భక్తులు ఆదివారం ఉదయం సింహగిరికి చేరుకొని అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. గిరి ప్రదక్షిణ చేయలేని భక్తులు కూడా ఆలయ ప్రదక్షిణ చేసేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో సింహగిరి భక్తులతో పోటెత్తింది. ఆదివారం వేకువజామునే స్వామివారిని సుప్రభాతంతో మేల్కొల్పి పల్లి ఆరాధన సేవ కార్యక్రమాలు నిర్వహించారు. చందన సమర్పణ అనంతరం భక్తులకు దర్శనాన్ని కల్పించారు. ఆలయ ప్రదర్శన చేస్తున్న భక్తులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా హరినామ స్మరణతో గిరిప్రదక్షిణను పూర్తి చేశారు. గిరిప్రదక్షిణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విజయవంతం కావడంపై దేవస్థానం అధికారులు జిల్లా అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అందరి సమన్వయంతో ఈ ఉత్సవం విజయవంతమైందని ఆలయ వర్గాలు ఆనందాన్ని వ్యక్తం చేశాయి.

ఎంపీ, ఎమ్మెల్యేను కలిసిన మాజీ ఎమ్మెల్సీ గాదె

ప్రజాశక్తి -భీమునిపట్నం : విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. నగరంలోని ఎంపీ, ఎమ్మెల్యేల నివాసాల వద్ద కలిశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, పిఆర్‌టియు నాయకులు కె.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించినట్లు పిఆర్‌టియు నాయకులు సన్యాసినాయుడు తెలిపారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని వినతి


ఎమ్మెల్యే పల్లాకు వినతిపత్రం ఇస్తున్న బలిరెడ్డి సత్యనారాయణ

ప్రజాశక్తి -గాజువాక : అగనంపూడిలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుచేయాలని, పశువైద్యశాల భవనం నిర్మించాలని కోరుతూ గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు ఎడిసి ఛైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ ఆదివారం వినతిపత్రం అందజేశారు. అగనంపూడి పునరావాస కాలనీలో 20 గ్రామాలకు చెందిన సుమారు 35 వేల జనాభా ఉన్నారని తెలిపారు. తరచూ విద్యుత్ అంతరాయం కలుగుతుందని, లో వోల్టేజీ వల్ల టీవీలు, రిఫ్రిజిరేటర్లు, ఇతర విద్యుత్తు సామాగ్రి కాలిపోతున్నాయని వివరించారు. అగనంపూడి ఆర్ఇసిఎస్ కార్యాలయం వద్ద ఇండోర్ విద్యుత్తు సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.

అగనంపూడి పునరావాస కాలనీలో ఉన్న పశు వైద్య కేంద్రం జివిఎంసి 79, 85, 86, 87, 88 వార్డులకు అనుసంధానంగా పనిచేస్తుందని తెలిపారు. ప్రస్తుతమున్న పశువైద్య శాల శిథిలావస్థలో ఉందని, సర్వేనెంబర్ 115/1 లో 17 సెంట్లు స్థలం ప్రభుత్వం కేటాయించిందని, ఆ స్థలములో పక్కా బిల్డింగు నిర్మించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్పందిస్తూ తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 85వ వార్డు తెలుగు యువత అధ్యక్షులు బండారు చందు రమేష్, వడ్డాది శ్రీనివాసరావు ఉన్నారు.

ఆధార్ మెగా డ్రైవ్‌ను వినియోగించుకోవాలి
ఎంపిడిఓ అప్పలనాయుడు

ప్రజాశక్తి-ఆనందపురం : ఆధార్ మెగా డ్రైవ్‌ను ప్రజలు వినియోగించుకోవాలని ఎంపిడిఓ అప్పలనాయుడు కోరారు. మండలంలోని లొడగలవానిపాలెం సచివాలయంలో ప్రత్యేక క్యాంపును ఏర్పాటుచేశామని, అక్కడ ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఐదేళ్లు నిండిన వారు ఆధార్ బయోమెట్రిక్ చేయించుకోవాలని, వారు 10వ తరగతి పూర్తయ్యాక ఒకసారి, 18 సంవత్సరాలు దాటిన వెంటనే మరొకసారి బయోమెట్రిక్ చేయించుకోవాలని చెప్పారు. ఆ నిబంధనలు పాటించని వారి ఆధార్‌కార్డులు పనిచేయవని తెలిపారు. 25 ఏళ్లు దాటిన వారు ఇంతవరకు ఎటువంటి డాక్యుమెంటులూ అప్‌డేట్ చేయకపోతే ఓటరు కార్డు, బ్యాంకు పాస్‌బుక్‌తో ఆధార్ క్యాంప్‌కు హాజరైతే అప్‌డేట్ చేస్తారని చెప్పారు.

శరవేగంగా అన్నక్యాంటీన్ల పునరుద్ధరణ పనులు

ప్రజాశక్తి -యంత్రాంగం

మధురవాడ : జివిఎంసి 5వ వార్డు పరిధి మారికవలస వద్ద, 7వ వార్డు పరిధిలోని వాంబే కాలనీ వద్ద అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ పనులు చురుకుగా సాగుతున్నాయి. పాడైపోయిన అన్న క్యాంటీన్లను బాగు చేసేందుకు జివిఎంసి నిధులను మంజూరు చేసింది. దీనికి సంబంధించిన అంచనాలను ఇంజినీరింగ్ అధికారులు రూపొందించారు. వీటితో సిమెంటు పనులు, విద్యుత్తు వైరింగ్, దీపాల ఏర్పాటు, రంగులు వేయడం, కౌంటర్లు, వాష్ బేసిన్లు, బల్లలు, భోజనశాల, సీలింగ్, మోటార్లు, టైల్స్, అద్దాలు, తలుపులు తదితర మరమ్మతులు చేపడుతున్నారు. త్వరలో అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు జోన్ 2 కమిషనర్ శైలజవల్లి తెలిపారు.


తగరపువలసలో సిద్ధమవుతున్న అన్న క్యాంటీన్ భవనం

భీమునిపట్నం : స్థానిక పెట్రోల్ బంక్ ఎదురుగా భీమిలిలోని చిన్నబజారు, బిఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో అన్న క్యాంటీన్ భవనాల పునరుద్ధరణ పనులు తుది దశకు చేరాయి. జివిఎంసి నిధులు రూ.16 లక్షలతో తగరపువలస, రూ.16.50 లక్షలతో భీమిలి చిన్న బజారు వద్ద క్యాంటీన్ భవనాల పునరుద్ధరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. తాగు నీటి సదుపాయం నిమిత్తం బోరు ఏర్పాటు, అన్న క్యాంటీన్ సిబ్బంది కోసం 2 టాయిలెట్ల పునరుద్ధరణ, చుట్టూరా ఆధునీకరణ, విద్యుత్ సదుపాయం తదితర పనులు ఊపందుకున్నాయి. భీమిలి చిన్న బజారు వద్ద అన్న క్యాంటీన్ ముందు చిన్న పాటి అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. 2018లో అప్పటి టిడిపి ప్రభుత్వం ఆధ్వర్యాన అన్న క్యాంటీన్లు ప్రారంభించి కేవలం రూ.5కే భోజనం అందించారు. వైసిపి ప్రభుత్వం 2019లో అధికారంలోకి రావడంతో ఈ క్యాంటీన్లు మూత పడ్డాయి.


ఎస్‌టి కమిషన్ మెంబర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కొల్లిదేముడు తదితరులు

సమస్యలపై జాతీయ ఎస్‌టి కమిషన్ మెంబర్‌కు వినతి

ప్రజాశక్తి- గాజువాక : భెల్ హెచ్‌పివిపి ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ సభ్యులు ఆదివారం జాతీయ ఎస్‌టి కమిషన్ మెంబర్ హుస్సేన్‌ను కలిసి సమస్యలపై వినతి పత్రం అందజేశారు. కంపెనీలోని ఎస్‌సి, ఎస్‌టి కార్మికులు తగు న్యాయం చేయాల్సిందిగా కోరారు. దీనికి హుస్సేన్ స్పందిస్తూ తగు న్యాయం జరిగేలా కృషిచేస్తానన్నారు. ఆయనను కలిసిన వారిలో కొల్లి దేవుడు, కె.పవన్‌కుమార్, పి.శ్రీను, ఆదినారాయణ పాల్గొన్నారు.



అర్లకునిపాలెంలో వైద్యశిబిరం ప్రారంభంలో పాల్గొన్న ప్రతినిధులు

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

ప్రజాశక్తి- పద్మనాభం : పద్మనాభం పంచాయతీ పరిధి అర్లకునిపాలెంలోని బంగారమ్మ ఆలయ ప్రాంగణంలో ఆదివారం సహాయత హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 200 మంది హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరం కూడా ఏర్పాటుచేశారు. గ్రామానికి చెందిన 17 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని గ్రామానికి చెందిన తెలుగుదేశం సీనియర్ నాయకులు ఆర్.సన్యాసిరావు ఏర్పాటు చేశారు.

పెట్టుబడి సాయం హామీని అమలు చేయాలి



మాట్లాడుతున్న రైతు సంఘం నేత నాయనబాబు

ప్రజాశక్తి- దేవరాపల్లి: రైతులకు పెట్టుబడి సాయం కింద ఏటా రూ.20వేలు ఇస్తానన్న హామీని చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డి వెంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం దేవరాపల్లి సిఐటియు కార్యాలయంలో వ్యవసాయకార్మిక సంఘం జిల్లా నాయకులు బిటి దొర అధ్యక్షతన జరిగిన ప్రజాసంఘాలు సమావేశంలో మాట్లాడుతూ, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయకార్మికులు సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని కోరారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు వ్యవసాయ పెట్టుబడి సాయం రూ.20 వేలు వెంటనే ఇవ్వాలని, భూయజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డు ఇవ్వాలని, ఆరు వారాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రూ. రెండు లక్షల వరకు రైతులకు, కౌలు రైతులకు రుణ మాఫీ చేయాలని, కేరళ తరహాలో రైతులకు రుణ విమోచన చట్టం చేయాలని, రైతాంగాన్ని అప్పులు నుండి విముక్తి చేయాలని కోరారు.

వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు పెట్టే జిఒ22 ను వెంటనే రద్దు చేయాలని కోరారు పెట్టుబడి సాయం, బ్యాంకు రుణాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు కౌలు రైతులకు వర్తింపేయాలని కోరారు.జాబ్‌కార్డున్న ఉపాధి కూలీలకు ఏటా 200 పనిదినాలను కల్పించడంతోపాటు రోజుకురూ.600 కూలీ చెల్లించాలని కోరారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా గ్రామ సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రాలు అందజేసి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో జె దేముడు, శివ చిన్నం నాయుడు, పి రాములమ్మ, జర్తా పోతురాజు పాల్గొన్నారు,

అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం



రోగులకు కంటిపరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం: మండలంలోని పైలవానిపురం గ్రామంలో ఉన్న సెజ్ కాలనీలో ఆదివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఈ కంటి వైద్య శిబిరాన్ని ట్రస్ట్ సభ్యులు, పైలవానిపురం గ్రామ ప్రజలు, యూత్ కలిసి ప్రారంభించారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో 107 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, ఐ డ్రాప్స్ అందజేశారు. 25 మంది రోగులను కంటి ఆపరేషన్స్‌కు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి బస్‌లో తరలించారు. గ్రామీణ ప్రాంతాల్లో కంటి వైద్య శిబిరాలు నిర్వహించి, పేదలకు వైద్యసేవలు అందిస్తున్న అమ్మ చారిటబుల్ ట్రస్ట్ బృందాన్ని స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, వార్డు సభ్యుడు రమేష్, లాలం శ్రీనివాస్ (వాసు), ఎల్. శ్రీను, ఎల్.కృష్ణ, జె.దివాకర్, జి.అప్పలకృష్ణ, యూత్, శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సిఐటియు జెండా తొలగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సిఐటియు నేతలు రాము, సోమినాయుడు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : అచ్యుతాపురం జంక్షన్‌లో ఉన్న సిఐటియు జెండాను తొలగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము, మండల కార్యదర్శి కే సోమినాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం సిఐటియు జెండా తొలగించిన స్థలం వద్ద వర్షంలో తడుస్తూ బైఠాయించి నిరసన తెలిపారు. జెండా తొలగించిన స్థలంలో యథావిధిగా ఏర్పాటు చేయాలని కోరారు.దీనిపై ఎమ్మెల్యే విజయ్‌కుమార్, సిఐ హామీతో నిరసన విరమించారు.


కల్లుగీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



ఎమ్మెల్యే గంటాకు వినతిపత్రం ఇస్తున్న గీత కార్మిక సంఘం నేతలు

ప్రజాశక్తి- కె.కోటపాడు: కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర దేవుడు ఆధ్వర్యంలో సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఆదివారం ఉమ్మడి విశాఖ జిల్లాల ఎమ్మెల్యేలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత వైసిపి ప్రభుత్వం గీత కార్మిక కుటుంబాలకు తీరని అన్యాయం చేసిందని, కూటమి ప్రభుత్వమైనా తమసమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని వేడుకున్నారు. రాష్ట్ర బడ్జెట్లో గీత కార్మికులకు రూ.50వేల కోట్ల నిధులు కేటాయించి, గీత కార్మిక వృత్తిని అభివృద్ధి చేయాలని, రసాయనాలతో తయారు చేసే మద్యంతో పోల్చకుండా, కల్లును శీతల పానీయంగా గుర్తించి అమలు చేయాలని, ప్రతి గీత కార్మికుడికి బీమా సదుపాయం కల్పించాలని, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 10 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని కోరారు. ఈమేరకు విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, ఉత్తర ఎమ్మెల్యే పి. గణబాబు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, విశాఖ జిల్లాఎక్సైజ్ సూపరింటెండెంట్‌లకు వినతిపత్రాలు అందజేశామన్నారు. వినతి పత్రం అందించిన వారిలో పట్నాలు కష్ట టిసిఎస్ అధ్యక్షులు , నరవ టిసిఎస్ అధ్యక్షులు జుత్తికి సంతోష్, పెద్దగదిల టిసిఎస్ అధ్యక్షులు షమ్ముంగి పోలయ్య, ము నసచెన్నారావు జిల్లా నాయకులు , సరిపల్లి టిసిఎస్ అధ్యక్షులు పట్టణాల కష్ణ, జుత్తికి నరసింహమూర్తి, టిసిఎస్ అధ్యక్షులు సరిపెల్లి, లావేటి మహాలక్ష్మి పెందుర్తి పెదగదిలి, అడవివరం మధురవాడ టిసిఎస్ అధ్యక్షులు, సమ్మెంగ రాజు, దమ్మెంగ్ రాజు తిక్కుజూరు నరసింహారావు, బత్తిన నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పాల్గొన్నారు.

బీమా పరిహారం అందజేత



బీమా పరిహారాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే సుందరపు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : రోడ్డు ప్రమాదంలో గాయపడిన జనసేన కార్యకర్త గాలి గణేష్ కుటుంబసభ్యులకు జనసేన క్రియాశీల సభ్యత్వం ద్వారా వర్తించిన రూ.50వేలు బీమా సాయాన్ని ఆదివారం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది పార్టీలో క్రియాశీలక సభ్యత్వం తీసుకోవడంతో గణేష్‌కు బీమా సౌకర్యం వర్తించిందన్నారు.కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు జనసేన పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బి రాందాస్, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి మోటూరు శ్రీవేణి, బలిరెడ్డి పూర్ణ, కొత్తపల్లి సన్యాసినాయుడు మార్లపల్లి సుజాత పాల్గొన్నారు.

వ్యాధులపై గ్రామీణ వైద్యులకు అవగాహన



మాట్లాడుతున్న చంద్రశేఖర్

ప్రజాశక్తి- చోడవరం : స్థానికంగా గ్రామాల్లో వైద్యం చేస్తున్న గ్రామీణ వైద్యులు రోగికి ప్రథమ చికిత్సతోపాటు ఆయనకున్న జబ్బు లక్షణాలను బట్టి ప్రథమ స్పందన రోగి ప్రాణాలను నిలబడుతుందని సంజీవిని హాస్పిటల్ ఎండి. డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం స్థానిక సంజీవిని హాస్పిటల్ ఆవరణలో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం, చోడవరం డివిజన్ ఆధ్వర్యంలో వైద్య, విజ్ఞాన(ఫస్ట్ రెస్పాండర్) అవగాహన సదస్సులో వివిధ అంశాలపై వివరించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ గండి నీరుపమ, ఆర్థోపెడిషియన్ డాక్టర్ వసంత కుమార్, కేన్సర్ వైద్యనిపుణులు డాక్టర్ గురు రాఘవేంద్ర నాయక్, డాక్టర్. శ్రీనివాసరెడ్డి పాల్గొని, పేదవారికి నాణ్యమైన వైద్యం, తక్కువ ఖర్చుతో చేస్తామని. ఆరోగ్యశ్రీ సదుపాయం కూడా ఉందని వివరించారు. రాష్ట్ర ఫెడరేషన్ గౌరవ సలహాదారులు డాక్టర్ ఎన్.ఎల్.రావు మాట్లాడుతూ. గ్రామీణ వైద్యులకు ప్రభుత్వం నుండి గుర్తింపు వచ్చేవరకు జెఏసి ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామన్నారు. డివిజన్ అధ్యక్షుడు దొడ్డి అమిత్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం వ్యవస్థ అధ్యక్షుడు జంగం జోషి, గౌరవ అధ్యక్షులు మమ్ముల తిరుపతి రావు, ప్రధాన కార్యదర్శి గాజువాక ఇంచార్జ్ ఈ.అను, ఆదినారాయణ, భవాని ప్రసాద్, ఐకే రావు, సీనియర్ నాయకులు రాంబాబు, మలాకర్ పాల్గొన్నారు.

పూడిమడక తీరంలో ఎగిసిపడుతున్న కెరటాలు



అలలు ఎగసిపడడంతో ఒడ్డుకు చేర్చిన బోట్లు, వలలు

ప్రజాశక్తి- అచ్యుతాపురం : బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ కారణంగా పూడిమడక సముద్రతరంలో కెరటాలు ఎగిసిపడుతున్నాయి. వాతావరణ హెచ్చరికలు కారణంగా తీరంలోనున్నా బోట్లు తెప్పలు వలలు తదితరమైన వేట సామాగ్రిని మత్స్యకారులు సురక్షితమైన ప్రదేశానికి తరలించారు. మూడు రోజులుగా సముద్రంలో చేపల వేటకు వెళ్లలేదు. తమను చేపల వేటకు వెళ్లొం రాదని హెచ్చరించినా ప్రభుత్వం ఎటువంటి సహాయ సహకారాలు అందజేయలేదని మత్స్యకారులు తెలిపారు. ఇదిలా ఉండగా లోతట్టు ప్రాంతమైన హరిపాలెం తిమ్మరాజుపేట కాజీ పాలెం పెదపాడు జగన్నపేట కొండకర్ల ఎర్రవరం ఉప్పవరము మల్లవరము చీమలపల్లి తదితర గ్రామాలలో వేసిన వరి నారుమళ్ళ వర్షాలకు నీట మునిగాయి. వర్షం నీరు బయటకు పోవడానికి మార్గం లేక మడులలో ఉండిపోవడంతో వేసిన వరి విత్తనాలు నీట మునిగాయి. దుక్కులు దున్నించి, కొనుగోలు చేసిన వరి విత్తనాలను నాట్లు వేసి మొక్కలు వస్తాయని ఆశతో ఎదురు చూస్తున్న రైతన్నలకు. నీట మునిగిన వరి నారుమడులను ఏమీ చేయలేని పరిస్థితిలో నిస్సహాయ స్థితిలో ఉన్నారు.

మృతుని కుటుంబానికి బీమా పరిహారం

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని ములకలాపల్లి గ్రామానికి చెందిన ఇంటి గణేష్ అనే జనసేన కార్యకర్త కొద్ది రోజుల క్రితం ప్రమాదావశాత్తు మరణించాడు. పార్టీ క్రియాశీలక సభ్యత్వం ఉండడంతో అతని కుటుంబానికి జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబు రూ.5 లక్షల బీమా పరిహారం చెక్‌ను నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాయపురెడ్డి కృష్ణ సమక్షంలో ఆదివారం అందజేశారు వీరితోపాటు జనసేన నాయకులు ఇంటి సురేష్ పాల్గొన్నారు

23 నుంచి ఆధార్ నమోదు శిబిరాలు

ప్రజాశక్తి-దేవరాపల్లి: మండలంలో ఈనెల 23 తేదీ నుండి 27వ తేదీ వరకు మూడు రోజులపాటు పది ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఇంచార్జ్ ఎంపిడిఒ ఎస్ అప్పలరాజు తెలిపారు. ఈ నెల 23వ తేదీన దేవరాపల్లి సచివాలయం 1,2 పరిధిలోని ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 24వ తేదీన రైవాడ, కాశీపురం సచివాలయం కేంద్రాల్లో, 25వ తేదీన పెదనందిపల్లి, ఏ కొత్తపల్లి గ్రామాల్లో, 26వ తేదీన తెనుగుపూడి, వాకపల్లి, 27వ తేదీన వేచలం, మామిడిపల్లి పరిధిలోని కేంద్రాల్లో ఆధార్ నమోదు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సచివాలయాల పరిధిలో పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీల్లో పెండింగ్‌లో వారికి ఆధార్ నమోదు, సవరణ చేస్తారన్నారు..ప్రధానంగా కొత్త ఆధార్ నమోదు, ఆధార్ డాక్యుమెంట్ తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్‌డేట్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.

సెంచరీకి చేరువలో కిలో టమాటా

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : టమోటా.... ఈ పేరు వింటేనే పేద మధ్య తరగతి వర్గాల గుండెల్లో గుభేల్ మంటున్నాయి. పేదవాడైనా పెద్దింటివాడైనా కూరల్లో టమోటా వినియోగం తప్పనిసరి. ధరతో సంబంధం లేకుండా అన్ని వర్గాల ప్రజలు టమోటాను వినియోగిస్తుంటారు. కొద్ది రోజులుగా టమోటా ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కొద్ది రోజుల క్రితం కిలో టమాట రూ. 40 నుంచి రూ.50 వరకు ఉండగా, ఇపుడది వందకు చేరుకుంది. ఉల్లిపాయ ధర కాస్త తగ్గినా, టమోటా ధరలు తగ్గక పోవడంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు.

కేన్సర్ నిర్ధారణ పరీక్షలు



రోటరీ క్లబ్‌లో నిర్వహించిన కేన్సర్ నిర్ధారణ వైద్యశిబిరం

ప్రజాశక్తి-అనకాపల్లి : రోటరీ తాటికొండ నూకయ్య శెట్టి మెమోరియల్ రోటరీ హాల్‌లో ఆదివారం విశాఖపట్నం మహాత్మా గాంధీ కేన్సర్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచితంగా రొమ్ము,నోరు, గర్భాశయ కేన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో పట్టణ ప్రజలు పాల్గొన్నారు. విశాఖపట్నం మహాత్మా గాంధీ కేన్సర్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుభద్ర,డాక్టర్ సుధానంద, దంత వైద్యులు డాక్టర్ సుకన్య, వీఆర్వో అర్జున్ నర్సింగ్ సిబ్బంది, రోటరీ క్లబ్ ఈ క్యాంప్ చైర్మన్ డాక్టర్ శ్యాంసుందర్, క్లబ్ అధ్యక్షులు ఎస్ రాజేష్ కుమార్, కార్యదర్శి అనిల్ ఈ క్యాంప్ కోచ్ చైర్మన్ ఎస్ .త్రినాథ్, సతీష్, కే ఎల్ కుమార్, మల్లేశ్వరరావు, బుద్ధ రమణాజీ,నూకయ్య శెట్టి, ముప్పన సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. కార్యక్రమంలో సుమారుగా మంది 80 మందికి స్త్రీ పురుషులకు కేన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.

గురువులకు ఘన సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : గురు పౌర్ణమి పురస్కరించుకొని ఆదివారం అనకాపల్లి జార్జ్ క్లబ్, భారత్ స్వాభిమాన ట్రస్ట్ పతాంజలి యోగ సెంటర్ ఆధ్వర్యంలో ఘనంగా గురువులకు సత్కారం నిర్వహించారు. నిర్వాహకులు బిఎస్ఎం కె జోగి నాయుడు, కోలపర్తి కన్నబాబు, బి. శ్రీనివాసరావు, ఆధ్వర్యంలో గురువులను సత్కరించారు. ఈ సందర్భంగా యోగా గురువులు జిల్లా అధ్యక్షులు భీశెట్టి దొరమ్మ నాయుడు, కార్యదర్శి మంగయ్య మాట్లాడుతూ ప్రకృతి ఫలహారాలను భుజిస్తూ,ప్రకృతిని ఆరాధిస్తూ,ప్రకృతితో మమేకమై జీవిస్తూ,శ్వాస పైనే ధ్యాసను ఉంచాలన్నారు.ప్రాణాపాయం, యోగాసనాల సాధనతో, రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోవచ్చన్నారు.ఉన్నత వ్యక్తిత్వాన్ని అలవర్చుకుంటూ, ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి ఎదిగే ప్రయత్నం చేయాలన్నారు. నైతిక విలువలను పాటిస్తూ, జీవితకాలం ఆరోగ్యంగా జీవించాలంటే యోగావిద్య ఒక్కటే సరైన మార్గం అని తెలిపారు. కార్యక్రమంలో కొణతాల శివాజీ, కె వి వి సత్యనారాయణ, కాండ్రేగుల చిన్న, ఆళ్ల సూర్య రామకష్ణ, కొణతాల పెద్ద, వంశీధర్, రోహిణి (మహిళా యోగా), రవణమ్మ, అన్ని ప్రాంతాల యోగ సాధకులు పాల్గొన్నారు.

లాలం భాస్కరరావుకు ఘననివాళి

ప్రజాశక్తి-అచ్యుతాపురం: టిడిపి రాష్ట్ర కార్యదర్శి లాలం భాస్కరరావు జయంతిని ఆదివారం అచ్యుతాపురం టిడిపి కార్యాలయంలో ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భాస్కరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కేకు కట్‌చేశారు.. ఈ సందర్భంగా భాస్కరరావు టిడిపికి చేసిన సేవలను, ఎలమంచిలి నియోజకవర్గ అభివృద్ధికి చేసిన కృషిని గుర్తు చేశారు. కొండకర్లలో ఇచ్ఛా ఫౌండేషన్‌లో అనాధ వికలాంగుల సమక్షంలో దివంగత లాలం భాస్కరరావు అభిమానులు ఆయన జయంతిని నిర్వహించారు.

వీధిదీపాల ఏర్పాటు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : అచ్చుతాపురం జంక్షన్‌లో ఎపిఐఐసి నిధులతో నిర్మించిన వీధిదీపాలను ఆదివారం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ప్రారంభించారు.కార్యక్రమంలో తాసిల్దార్ సరోజినీ, ఎంపీడీవో సురేష్ కుమార్, మాజీ జెడ్పిటిసి సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు జనసేన పార్టీ అచ్చుతాపురం మండల శాఖ అధ్యక్షుడు బి రాందాస్, ద్వారపు రెడ్డి బాబ్జి, కె చిన్నారావు, ఏపీఐఐసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వికలాంగులకు యూనిఫారాలు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : అచ్యుతాపురం అయ్యప్పస్వామి ఆలయం ఆవరణలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలోగురు పౌర్ణమి సందర్భంగా స్థానిక వికలాంగుల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు కుక్కర సీతారామయ్య కుటుంబీకులు ఆధ్వర్యంలో యూనిఫామ్ పంపిణీ చేశారు.కార్యక్రమంలో సత్యనారాయణ, సత్య రాజేశ్వరి, సీతా లక్ష్మి కాంతము, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల బిల్లులకు ఐదున్నరేళ్లుగా ఎదురుచూపులు

- ప్రభుత్వం మారడంతో నిలిచిన చెల్లింపులు
- వడ్డీకి అప్పులు తెచ్చి అవస్థలు పడుతున్న నేతలు
- కూటమి ప్రభుత్వంపైనే కొండంత ఆశలు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : వైసిపి వేధింపులకు ఐదున్నరేళ్లుగా ఇబ్బందులు పడ్డ ప్రజా ప్రతినిధులు, ఈ ప్రభుత్వంలోనైనా న్యాయం జరుగుతుందా?అని ఎదురుచూస్తున్నారు. 2014 -19లో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నాటి సర్పంచ్ లు, ఎంపిటిసిలు, ముఖ్య నాయకులు మండలంలో పలు గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో(నరేగా)భాగంగా గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధి పనులు చేశారు. గ్రామాల్లో మౌలిక వసతులు పూర్తిస్థాయిలో సమకూరాయి. 2018-19 ఆర్థిక సంవత్సరంలో ఒక్కొక్క గ్రామంలో కోట్లాది రూపాయల నిధులతో కిలోమీటర్ల మేర సిసి రోడ్లు, అవసరం ఉన్న ప్రతి చోట డ్రైనేజీలు నిర్మించారు. వీటికి సంబంధించిన బిల్లులను 2018 అక్టోబర్ నుండి 2019మార్చి వరకు చేపట్టిన రోడ్లు డ్రైనేజీ డ్రైనేజీలకు సంబంధించిన బిల్లులను అప్లోడ్ చేసారు. ఆర్థికంగా స్తోమత లేనివారు సైతం గ్రామాలు అబివృద్ధి అవుతాయి అన్న ఉద్దేశంతో లక్షలాది రూపాయలను రెండు, మూడు రూపాయలకు వడ్డీ లకు అప్పులు తెచ్చి పనులను పూర్తి చేశారు. . 2019లో అధికారంలోనికి వచ్చిన వైసిపిసర్కార్ గ్రామాల్లో రోడ్లు డ్రైనేజీలు నిర్మించిన వారికి చుక్కలు చూపించింది. మండలంలో రూ. 25 కోట్ల బిల్లులు నిలిచిపోయాయి. నాటి వైసిపి సర్కార్ అభివద్ధి పనులు చేసిన వారందరూ తెలుగుదేశం పార్టీ వారేనన్న ఉద్దేశంతో బిల్లులు నిలిపివేయడంతో, పనులు చేపట్టిన నాయకులు ఆర్థికంగా అప్పులు ఊబిలో చిక్కుకుపోయారు. చేసిన పనులకు బిల్లులు రాక, వడ్డీలకు అప్పులు ఇచ్చిన వారి నుండి వేధింపులు తట్టుకోలేక ఆస్తులను సైతం అమ్ముకొని కొంతమంది అప్పులు తీర్చారు. మరి కొంతమంది గ్రామాలు విడిచి కూలి పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. కొంతమంది నాయకులు కోర్టుకు వెళ్లడంతో అరకొరగా రూ.15 కోట్ల వరకు బిల్లులు చెల్లించారు. మండలంలో గల 32 గ్రామపంచాయతీలో రూ.10 కోట్ల వరకు ఇంకా బిల్లుల బకాయి ఉంది. దీంతో కొంతమంది అరకొరగా బిల్లు వచ్చిన వారంతా మిగతా బిల్లులు రాకపోవడం తో ఆందోళన చెందుతున్నారు. టిడిపి అధికారంలోకి రావడంతో నాడు అభివద్ధి పనులు చేసిన సర్పంచులు, ఎంపిటిసిలకుకాస్త ఊపిరి వచ్చింది. ఐదున్నరేళ్లుగా వడ్డీలు చెల్లిస్తూ ఆర్థికంగా నష్టపోయిన వారికి ప్రస్తుత ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఆశిస్తున్నా.రు.


ఐదేళ్లక్రితం నిర్మించినా బిల్లుకు నోచుకోని సిమెంట్ రోడ్డు

భూములమ్మి అప్పులు తీర్చా


ఓట్లేసి గెలిపించిన ప్రజలకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలన్న ఉద్దేశ్యంతో గ్రామంలో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాను. రూ.45 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉంది. అప్పులోళ్ల ఒత్తిడి తట్టుకోలేక విలువైన భూములు అమ్మి అప్పులు తీర్చాను.

- దొంకిన అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ బుచ్చయ్యపేట

ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నా


గ్రామంలో చేసిన పంచాయతీ భవన నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేశాను.రూ. 60లక్షలు వరకు బిల్లులు రావాల్సివుంది. ఆర్థికంగా తీవ్ర ఇబ్బంది పడుతున్నాను. ప్రభుత్వం ఆదుకోవాలి.

- కోట సత్యనారాయణ, మాజీ సర్పంచ్

కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి


గ్రామ అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో రోడ్లు వేయించాను. దానికి పెట్టుబడి కోసం రూ.2ల వడ్డీకి రూ.60లక్షలు తెచ్చాను. పనులు పూర్తిచేసినా నేటికీ బిల్లులు రాలేదు. ఐదేళ్లుగా ఎదురు చూస్తున్నాను. ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లించి ఆదుకోవాలి.

- కోరుకొండ రవికుమార్, డిసిసిబి మాజీ డైరెక్టర్, తురకలపూడి

ముంపు బారిన వరి నారుమళ్లు


బుచ్చయ్యపేటలో వర్షపు నీటి ముంపులో వరి నారుమడి

ప్రజాశక్తి - కె.కోటపాడు : నీట మునిగిన వరి నారుమళ్లను రైతులు సంరక్షించుకోవాలని మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ సూచించారు. ఆదివారం పలు గ్రామాల్లో పర్యటిస్తూ రైతులకు క్షేత్రస్థాయిలో నివారణ పద్ధతులను వివరించారు. కే.కోటపాడు, గొండుపాలెం, గరుగుబిల్లి, వారాడ, సింగన్న దొరపాలెం, ఏ కోడూరు, కింతాడ, వి సంతపాలెం, రొంగల నాయుడుపాలెం, ఆర్.వై అగ్రహారం గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించారు. నీట మునిగిన వరి నారుమడుల్లో నీరు వెంటనే తీసివేయాలని, ఐదు రోజులకు పైగా ముంపులో ఉంటే నారుకు నష్టం జరుగుతుందన్నారు. నారుమళ్లలోని నీటిని తొలగించి యూరియా పొటాషియం కొద్ది మోతాదులో జల్లుకోవాలన్నారు. ఎక్కడైనా సూక్ష్మ పోషక లోపాలు కనిపిస్తే ఆకులు తెల్లగా పాలిపోయి నారు ఎదుగుదల ఉండదన్నారు. దీని నివారణకు ఫెర్రర్ సల్ఫేట్ లీటర్‌కు ఐదు గ్రాములు, నిమ్మ ఉప్పు రెండు గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు. కుళ్లుతెగులు కనిపిస్తే హెక్సకోనాజోల్ అనే శిలీంద్ర నాశకమందు పిచికారి చేయాలన్నారు. రైతులు దగ్గరలో ఉన్న రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు.

అనకాపల్లి : మూడు రోజులుగా పడుతున్న వర్షాలు ప్రస్తుత వరి నారుమళ్లకు జీవం పోశాయనిమండల వ్యవసాయ అధికారి రంగాచారి తెలిపారు. లో ఆదివారం తుమ్మపాలలో ముంపుకు గురైన నారుమళ్లను రైతులతో కలిసి పరిశీలించారు. వర్షం తెరిపినిచ్చిన వెంటనే నారుమళ్లలోని నీటిని తొలగించాలన్నారు. ఇప్పటికే 10 నుంచి 20 రోజుల వయసులో చాలాచోట్ల నారుమడులు ఎదిగి ఉన్నాయి. కొన్ని మండలాల్లో మాత్రమే ఉడుపులకు సిద్ధమవు తున్నారు. మొదటి దమ్ముకు సరిపడా వర్షం పడిన నేపథ్యంలో మొదటి మురగు దమ్ము చేసుకోవడం ద్వారా పాత కలుపు లేకుండా పోతుందని, పెరిగిన కలుపు ఎరువుగా తయారవ్వడానికి ఉపయోగపడుతుందన్నారు ముందు రోజు దమ్ము చేసి, మరుసటి రోజు నాట్లు వేసుకోవడం మంచిదని సూచించారు. ప్రస్తుతం నారుమడులలో ఎలాంటి చీడపీడలు లేకపోయినప్పటికీ, వాతావరణం మేఘావతమై ఉండడం వల్ల పొడ తెగులు ఆశించే అవకాశం ఉందన్నారు. ఎక్కడైనా నారు చనిపోవడం మొదలెతే హెక్సాకొనజోల్ మందు ఒకసారి పిచికారి చేయాలన్నారు. నారుమళ్లలోని నీరు తొలగి పోగానే రెండు కిలోల యూరియా,ఒక కేజీ పొటాష్ ఎరువులను ఐదు సెంట్ల నారుమడిలో చల్లుకోవాలన్నారు. రైతు సంఘం నాయకులు పీలా బుజ్జి పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి మండలంలో గల దిబ్బిడి,బుచ్చయ్యపేట, కందిపూడి రాజాం తదితరు గ్రామాల్లో వరి నారుమళ్లు నీట మునిగిపోయాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు ఏపుగా ఎదిగిన నారు నీటమునగడంతో కుళ్లిపోతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

శివాలయం నిర్మాణానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- సబ్బవరం.: మండల కేంద్రంలోని శివాలయం నిర్మాణానికి సబ్బవరానికి చెందిన అడగర్ల సత్యం నాయుడు మాస్టారు రూ.20,116 ఆర్థిక సహాయం అందజేసినట్లు ఆలయ నిర్మాణ కమిటీ తెలిపారు. ఈ సందర్భంగా సత్యం నాయుడు మాస్టారుకుఏ ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో బర్ల రమణ, గెడ్డం కష్ణ, కొల్లి గంగునాయుడు, చిత్రాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డైవర్షన్ గండి పరిశీలన

ప్రజాశక్తి- వడ్డాది : బిఎన్ రోడ్డులో గండి కొట్టిన తాచేరు డైవర్షన్ రోడ్డును ఆదివారం ఆర్‌డిఒ చిన్నికృష్ణ పరిశీలించారు. రోడ్డుకు గండి కొట్టడంతో వడ్డాది-చోడవరం మధ్య రాకపోకలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆర్‌డిఒ సంబంధిత ప్రదేశాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. గండి పెద్దది కాకుండా ఉండేందుకు గొట్టాల మధ్యలో ఇసుక బస్తాలు అడ్డంగా వేయించారు. వర్షాలు తగ్గిన వెంటనే మరమ్మతులు చేయిస్తామన్నారు.

ముసురుతో ముప్పు

-పొంగి ప్రవహిస్తున్న గెడ్డలు -జలమయమైన రోడ్లు -పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు



గొలుగొండ మండలం ఏఎల్ పురం చెరువులో నీరు



. నక్కపల్లిలో బురదగా ఉన్న రోడ్డు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అంతా అస్తవ్యస్తంగా మారింది. వర్షాలకు తాండవ రిజర్వాయర్కు ప్రధాన నీటి వనరు బొడ్డేరు ఉధృతంగా ప్రవహిస్తుంది. మండలానికి సమీపంలో ఉన్న గిరిజన గ్రామాల ప్రజలు వెళ్లే కేడీపేట జంక్షన్ నుండి రాకపోకలు నిలిచాయి. కేడి పేటకు సమీపంలో ఉన్న మాకవరం-నడింపాలెం గ్రామాల మధ్య బొడ్డేరుపై వేసిన డైవర్షన్ రోడ్డు భారీ వర్షాలకు గండి ఏర్పడింది.ఆయా గ్రామాల ప్రజలు నిత్యావసర సరుకులు కొనుగోలు, వైద్యావసరాలుకు కేడీపేట పైనే ఆధారపడుతుంటారు. అప్రోచ్ రోడ్డు కొట్టుకు పోవడంతో కేడీపేటకు రాకపోకలు నిలిచి సుమారు 20 గిరిజన గ్రామాల ప్రజలందరూ పలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే కేడీపేట నుంచి చింతపల్లి వెళ్లే హైవే రోడ్డు పై ఘాట్ రోడ్లో కొండ చరియలు విరిగి పడడంతో పెద్ద వాహనాల రాకపోకలు నిలిపివేశారు. అప్రోచ్ రోడ్డు కూడా కొట్టుకు పోవడంతో దిగు ప్రాంతంలో ఉన్న గిరిజన గ్రామాల ప్రజలకు కూడా పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి.

మండలంలో నర్సీపట్నం నుండి కృష్ణదేవి పేట వరకు ఉన్న ప్రధాన రహదారిపై గోతులు ఏర్పడి వర్షపు నీరు నిలిచి ప్రయాణికులకు ప్రమాద భరితంగా మారాయి. గోతుల వద్దకు వచ్చే సరికి వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్త వహించినా ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. మండలంలో ఏఎల్ పురంతో సహా పలు గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేని కారణంగా వర్షపు నీరంతా రోడ్లపై నిలిచాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కూరగాయల సాగుకు కొంత ఇబ్బంది ఏర్పడినా, వరి పొలాల ఉడుపులకు, సరుగుడు, ఆయిల్ ఫామ్ తోటలకు చాలా ఉపయోగపడతాయని రైతులు తెలిపారు.



గొలుగొండలో ప్రవహిస్తున్న బొడ్డేరు

కోటవురట్ల: మండల వ్యాప్తంగా ఆదివారం ఉదయం నుంచి వర్షం ఏకధాటిగా కురిసింది. కురిసిన వర్షానికి వరాహ, సర్పా నదులు ప్రవహిస్తున్నాయి. మండలంలో పలు ప్రాంతాల్లో రహదారులపై నీళ్లు నిలవడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా ఎంపీడీవో కార్యాలయం, సీతారామరాజు నగర్ వద్ద నీళ్లు నిలిచి పోయాయి. పలు ప్రాంతాలలో వరి నారు మడులు నీట మునిగాయి.

నక్కపల్లి: గత నాలుగు రోజుల నుంచి వీడని ముసురుతో ప్రజానీకం కష్టాలు పడుతున్నారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో జనం ఇంటి నుంచి బయటకు కాలు పెట్టలేని పరిస్థితి నెలకొంది. రోజువారి పనులకు వెళ్లే వారికి ఉపాధి లేకుండా పోయింది. వ్యాపారాలు కుంటుపడ్డాయి. పాడి పశువులు మేపుకుని జీవనం సాగిస్తున్న పాడి రైతులకు పశు పోషణ ఇబ్బందికరంగా మారింది. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడం వలన పశువులకు పశుగ్రాసం కొరత ఏర్పడింది.దీంతో పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు.తుఫాన్ ప్రభావం హెచ్చరికల నేపథ్యంలో గత నాలుగు రోజుల నుంచి మత్స్యకారులు వేటకు వెళ్లలేదు. వేటకు వెళితే గాని పూట గడవని పరిస్థితుల్లో మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారు.



కోటవురట్లలో ప్రవహిస్తున్న వర్షపు నీరు



చెక్కును చూపుతున్న నాయకులు

బీమా చెక్కు పంపిణీ

ప్రజాశక్తి-గొలుగొండ: కార్యకర్తలకు అన్నివేళలా జనసేన పార్టీ అండగా ఉంటుందని నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ సూర్యచంద్ర అన్నారు. మండలంలో లింగంపేట గ్రామంలో ప్రమాదవశాత్తు మృతి చెందిన జనసేన క్రియాశీలక సభ్యుడు అల్లు సత్తిబాబు కుటుంబీకులకు బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనసేన క్రియాశీలక సభ్యత్వం పొందిన ప్రతి ఒక్కరికి ఐదు లక్షల రూపాయల ప్రమాద బీమా వర్తిస్తుందని అన్నారు. ప్రతి కార్యకర్త క్రియాశీలక సభ్యత్వాన్ని తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొరబాబు, రేగుబళ్ళ శివ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వర్క్ షాప్‌నకు శాప్ కోచ్ అబ్బు ఎంపిక

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: పంజాబ్, పాటియాలా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో జరుగుతున్న స్పోర్ట్స్ సైకాలజీ, న్యూట్రిషన్ స్ట్రెంత్ కండిషన్ వర్క్ షాప్‌నకు స్థానిక శాప్ కోచ్ అబ్బు ఎంపికయ్యారు. ఈ నెల 22 నుండి 6 రోజుల పాటు పాల్గొననున్నారు. అందులో ఫారిన్ కోచ్‌లు ఒలింపిక్ స్థాయి కోచ్‌లు అందరూ పాల్గొంటారు. ఎంపికైన అబ్బును ఏపీ బాక్సింగ్ అసోసియేషన్ సెక్రటరీ లక్ష్మణ్ దేవ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరావు అభినందించారు. నింజాస్ అకాడెమీ సీనియర్ కోచ్ శేఖర్ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ ఆనందం వ్యక్తం చేశారు.





పూడుస్తున్న గోతులు

బస్ స్టేషన్‌లో గోతులు పూడ్చివేత

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో ఏఎల్ పురం బస్సుస్టేషన్లో గోతులను సర్పంచ్ లోచల సుజాత ఆధ్వర్యంలో ఆదివారం పూడ్చివేశారు. బస్ స్టేషన్ ఆవరణలో గోతులు ఏర్పడటంతో కొద్దిపాటి వర్షం కురిసినా గోతులు నిండుతుండటంతో ప్రయాణికులు పలు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ప్రయాణికుల అవస్థలు సర్పంచ్ దృష్టికి రావడంతో ఆదివారం గోతులను పూడ్చి వేయించి వర్షపు నీటిని నిలబడకుండా తొలగి పోయే ఏర్పాట్లు చేశారు. దీంతో ప్రయాణికులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

అత్తపై అల్లుడు దాడి

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో కైలాస పట్నం గ్రామం లో ఆదివారం సాయంత్రం అత్త తంగేటి పద్మ పై అల్లుడు పి రమేష్ దాడి చేశాడు. ఈ ఘటనలో అత్త తీవ్రంగా గాయపడింది. ఇంటి స్థలం విషయంలో వివాదం చోటు చేసుకున్నట్లు తెలిసింది. ఆమెను స్థానికకమ్యూనిటీ హెల్త్ సెంటర్కు తరలించారు. బాధితురాలి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై రమణయ్య తెలిపారు.

రైతులకు తప్పని అవస్థలు

వంతెన నుంచి నీటి ప్రవాహంతో వెతలు




వంతెన పైనుండి వెనక్కి ప్రవహిస్తున్న నీరు..

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో పాములవాక గ్రామం వద్ద ఏలేరు కాలువ పై 2.40 కోట్లతో జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు నిర్మించిన వంతెనతో గ్రామంలో రైతులు ఆందోళన చేస్తున్నారు. ఇక్కడ నిర్మించిన వంతెన పైనుండి పంట పొలాలకు వెళ్లాల్సిన రైతులు కొత్తగా నిర్మించిన బ్రిడ్జిపై నీరు నిలిచి పోవడంతో రైతన్నలు అవస్థలు పడుతున్నారు. అధికారుల అనాలోచితంగా కట్టడం పట్ల పలువురు అసహనం, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఇక్కడ నిర్మించిన వంతెన పైనుండి అధిక వర్షాలు వచ్చేటప్పుడు సమీపంలో గల చెరువుకి నీరు వెళ్లాల్సి ఉంది. చెరువులోకి వెళ్లాల్సిన నీరు చెరువు నుండి రివర్స్ అవుతుంది. వంతెన దిగువన నిర్మించడంతో చెరువు నుంచి నీరు వంతెన పైకి చేరుతుంది. సుమారు ఐదు అడుగులు వరకు వెనక్కి ప్రవహించడంతో రైతులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. దీంతో, ఆందోళన చెందుతున్నారు. రైతులకు ఇబ్బంది కలగకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు, మాజీ ఎమ్మెల్యే కుమారుడు భాస్కర్రావు జివిఎంసి అధికారులను కోరారు. నిర్లక్ష్యం వహిస్తే రైతుల పడుతున్న ఇబ్బందులను మంత్రి అనిత దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారి నానాజీని వివరణ కోరగా.. నిర్మించిన వంతెన పై నుండి నీరు వెనక్కి రావడం వాస్తవమేనని, ఇరిగేషన్ అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

పిహెచ్‌సిని తనిఖీ చేసిన డిఎం అండ్ హెచ్‌ఒ

ప్రజాశక్తి-పెదబయలు : మండలంలోని రూడకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సి.జమాల్ బాషా ఆకస్మికంగా తనిఖీ చేశారు. అల్లూరి జిల్లాలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, మందులు తదితర విషయాలపై ఆరా తీశారు. అనంతరం రిజిస్టర్లను తనిఖీ చేశారు. విధులపై నిర్లక్ష్యంగా సిబ్బందికి షోకాజ్ నోటీసులు ఇస్తున్నట్టు ఆయన తెలిపారు. సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో ప్రజలు సీజనల్ వ్యాధులతో ఇబ్బంది పడి వస్తుంటారని తెలిపారు.



పరిశీలిస్తున్న డిఎం అండ్ హెచ్‌ఒ



నినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

వసతి గృహ ప్రహరీ నిర్మించాలి

ప్రజాశక్తి -అరకులోయరూరల్: కూటమి ప్రభుత్వం స్థానిక వసతి గృహంలో ప్రహరీ గోడ నిర్మించి మహిళల విద్యార్థులకు రక్షణ కల్పించాలని ఎస్ఎఫ్ఐ నేతలు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఎస్ఎఫ్ఐ అరకులోయ నూతన మండల కమిటీ ఎన్నికైంది. మండల అధ్యక్ష కార్యదర్శులుగా శాంతి, అరుణ, ఉపాధ్యక్షులుగా శ్వేత, సహాయ కార్యదర్శులుగా దోస్ రాణి, నందిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కార్తీక్ శ్రీను, కార్యదర్శి జీవన్ కృష్ణ హాజరై మాట్లాడారు. ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల వసతి గృహంలో ప్రహరీ గోడ నిర్మాణాన్ని నిలిపేశారన్నారు. కూటమి ప్రభుత్వం వసతి గృహంలో ప్రహరీ గోడ నిర్మించి మహిళల విద్యార్థులకు రక్షణ కల్పించాలన్నారు.ప్రహరి గోడ లేకపోవడంతో వసతి గృహంలోకి ఎద్దులు, కుక్కలు, పాములు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బలరాం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యమకారులపై పెట్టిన కేసులు కొట్టివేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉద్యమకారులపైనా, సిపిఐ, ప్రజా సంఘాల నాయకులపైనా ఉద్యమాల సమయంలో పెట్టిన అక్రమ కేసులను కొట్టివేసేలా చూడాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు ఆదివారం టిడిపి కార్యాలయంలో సిపిఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సత్యనారాయణ, ఎస్‌కె.రెహమాన్, పి.చంద్రశేఖర్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.అచ్యుతరావు పాల్గొన్నారు.

రోడ్డు, విద్యుత్ సౌకర్యం కోసం గిరిజనుల పాదయాత్ర

చేతులు జోడించి వేడుకోలు

ప్రజాశక్తి-రోలుగుంట:తమ గ్రామాలకు కనీస మౌలిక సౌకర్యాలైన విద్యుత్, రోడ్డు సౌకర్యం కల్పించాలంటూ జాజులబంద, నీలిబంద, పిత్రిగెడ్డ, పెదగరువు ఆదివాసీ గిరిజనులు ఆదివారం ఆందోళన బాట పట్టారు. ఆరు కిలో మీటర్ల పాదయాత్ర చేసిన అనంతరం మోకాళ్లపై నిల్చుని చేతులు జోడించి వేడుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.గోవిందరావు మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల సరిహద్దు మండలాలు కొయ్యూరు మండలం మాలపేట పంచాయతీ జాజుబంద్ గ్రామం వెళ్లాలంటే అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం ఆర్ల గ్రామం నుండి పెద్దగరువు, పిత్రిగడ్డ, నీలిబంధ గ్రామాల మీదుగా ఆరు కిలో మీటర్లు ప్రయాణం చేయాలన్నారు. ఈ నాలుగు గ్రామాల గిరిజనులు 100 కుటుంబాలు, పివిటిజి తెగ గిరిజన చెందిన 250 మంది జనాభా కొండ శిఖర గ్రామాల్లో గ్రామాల్లో జీవనం సాగిస్తున్నారని చెప్పారు. ఈ నాలుగు గ్రామాల గిరిజనులు రేషన్ బియ్యం కోసం, వైద్య సేవలకు, అంగన్వాడీ పోష్టికాహారం కోసం వెళ్లాలంటే రాను పోను 12 కిలో మీటర్లు వెళ్ళి వస్తుండన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో 2021 సంవత్సరంలో ఆదివాసి గిరిజనులు చందాలు వేసుకుని ఆర్ల గ్రామం నుండి జాజులబంధ గ్రామం వరకు ఆరున్నర కిలోమీటర్ దూరం రోడ్డు నిర్మాణానికి ఏడు లక్షలు ఖర్చు పెట్టారన్నారు. అప్పటినుండి బైకులు వెళ్లడానికి అవకాశం ఏర్పడిందన్నారు. అనేక ఆందోళన చేసిన ఫలితంగా 2023 సంవత్సరంలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా (మెటీరియల్ కాంపినేటివ్) నుండి మెటల్ రోడ్డు రోడ్డు నిర్మాణం నిమిత్త 79 లక్షలు నిధులు మంజూరు చేశారన్నారు. ఈ నిధుల్లో 29 లక్షలు పనులు చేయకుండా కాంట్రాక్టర్‌కు అడ్వాన్స్ బిల్లు ఇచ్చారని, పాక్షికంగా నిర్మాణ పనులు కొద్దిగా చేశారన్నారు. దీంతో కనీసం బైకులు వెళ్లడానికి కూడా వీలు లేకుండా పోయిందన్నారు. డోలీ కట్టుకొని ఆందోళన చేస్తే. అధికారులు స్వయంగా ఎనిమిది కిలోమీటర్లు నడుచుకొని వచ్చి గ్రామానికి పెన్షన్ ఇచ్చారన్నారు. నీళ్ల బంధ గ్రామానికి నేటికీ కూడా కరెంటు సౌకర్యం లేదన్నారు.ఇప్పటికైనా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం నాయకులు కొండ తాంబల వెంకట్రావు (జాజులు బంద), కొండబాబు, పలు గ్రామాల గిరిజనులు, తదితరులు పాల్గొన్నారు.



చేతులు జోడించి నిరసన చేపడుతున్న గిరిజనులు, నాయకులు



బ్రహ్మ కమలాలు

వికసించిన బ్రహ్మ కమలాలు

ప్రజాశక్తి -గొలుగొండ: కేడీపేటలో ఓ ఉపాధ్యాయుని ఇంట బ్రహ్మ కమలాలు వికసించాయి. కేడీపేటలో వాసు అనే ఉపాధ్యాయుడు బ్రహ్మ కమలాల మొక్కను హిమాలయాల నుంచి తెచ్చి నాటారు. గత మూడు సంవత్సరాల నుంచి ఆయన ఇంట గురుపౌర్ణమి రోజు నాటికి పూర్తి స్థాయిలో వికసిస్తాయి. ఆ సమయంలో కుటుంబీకులు అందరూ కలిసి బ్రహ్మ కమలాలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.



పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

చారిత్రక భవనాలను కాపాడుకోవాలి

ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:చారిత్రక ప్రసిద్ధి చెందిన పాత నగరంలోని టౌన్ హాల్, క్లబ్ హౌస్ బిల్డింగ్, వాటర్ ట్యాంక్ పరిసరాలు డ్రగ్స్, గంజాయి, మందుబాబులకు అడ్డాగా మారిందని తెలియడంతో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆదివారం ఆ ప్రాంతాలలో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ మూడు చోట్ల తాగుబోతులు ఉపయోగించిన మద్యం, బీరు బాటిల్స్ కుప్పలు కుప్పలుగా కనిపించాయి. పరిసరాలు చెత్తతో అపరిశుభ్రంగా ఉన్నాయి. కుక్కలకు నిలయంగా మారాయి. దీనిపై ఆయన ఆగ్రహం వెలిబుచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎంతో చరిత్ర కలిగిన భవనాలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సుమారు రూ.10 కోట్లతో శిథిలావస్థకు చేరిన టౌన్ హాల్‌ను పునరుద్ధరించడం జరిగిందన్నారు. ఈ భవనాలను సద్వినియోగించు కోవాలన్నారు. పాతవి టెండర్లు ఏమైనా ఉంటే అవి రద్దుచేసి, త్వరగా వేలం వేసి జివిఎంసి కి ఆదాయం వచ్చేలా చూడాలని, భవనాలను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని జోనల్ 4 కమిషనర్ శివప్రసాదను ఆదేశించారు. ఈ ప్రాంతంలో వెంటనే సెక్యూరిటీని నియమించి, ఇటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూడాలని ఆదేశించారు.

వైసిపి అరాచకాలను భరించలేకే

కార్పొరేటర్లు పార్టీ మారారు : పల్లా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఐదేళ్ల పాటు రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైసిపి ప్రభుత్వం సాగించిన అరాచకాలను భరించలేకే వైసిపి కార్పొరేటర్లు 12 మంది ఆదివారం ఆ పార్టీని విడిచి కూటమి పార్టీలలో చేరారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం టిడిపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వైసిపి నుంచి వచ్చిన కార్పొరేటర్లకు ఆయన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాము ఏ ఒక్క కార్పొరేటర్‌నూ బలవంతం చేయలేదని, వారే స్వచ్ఛందంగా వచ్చి చేరారని చెప్పారు. పార్టీలు మారిన కార్పొరేటర్లు ఉన్న ప్రాంతాలలో ప్రారంభం నుంచి తెలుగుదేశం పార్టీలో పనిచేస్తున్న నాయకులు మనస్థాపానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. అయితే వారు అటువంటి ఆలోచన చేయవద్దన్నారు. అటువంటి వారికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కార్పొరేటర్లు వారి వారి ప్రాంతాలలో ప్రజల విశ్వాసాన్ని పొంది గెలుపొందారని, నిత్యం వారు ప్రజలతో కలిసి, మెలిసి ఉంటారని, స్థానిక సంస్థలపై వారికి పూర్తి అవగాహన ఉంటుందని చెప్పారు. జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు జగన్ పాలనను, వైసిపి పాలనను తరిమికొట్టారని చెప్పారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ వైసిపిలో మచ్చలేని, కార్పొరేటర్లను మాత్రమే చేర్చుకోవడం జరుగుతుందని చెప్పారు.

పాఠశాలల భవన నిర్మాణాలకు ప్రతిపాదనలు

- డిఇఒ వెంకటలక్ష్మమ్మ



పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న డిఇఒ

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని పెదబోదిగల్లంలో శిథిలావస్థలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాన్ని ఆదివారం డీఈవో వెంకట లక్ష్మమ్మ, డిప్యూటీ డిఇఒ అప్పారావు పరిశీలించారు. గత కొంతకాలంగా పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో భవనం పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో, ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు భయందోళన చెందుతున్నారు. ఈ సమస్యను గతంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. గత రెండు, మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల నేపథ్యంలో శిథిలంగా ఉన్న పాఠశాల భవనాన్ని డిఇఒ పరిశీలించారు. పాఠశాల భవనం శ్లాబ్ బీటలు బారి పెచ్చులూడి తరగతి గదుల్లో కింద పడటాన్ని ఆమె పరిశీలించారు. ప్రస్తుతానికి రెండు తరగతులను స్థానికంగా ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు మర్చాలని హెచ్ఎం సత్యనారాయణకు సూచించారు. అనంతరం ఇంజనీరింగ్ డిఈఈ జి.జె.వి.ప్రసాద్, అసిస్టెంట్ ఇంజనీర్ డి.సత్యస్వరూప్‌లతో ఆమె మాట్లాడారు .శిథిలంలో ఉన్న భవనాల స్థానంలో నూతన భవన నిర్మాణాలు చేపట్టేందుకు ప్రతిపాదనలు రూపొందించ చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నరేష్, ఎంపీడీవో శ్రీనివాస్, స్కూల్ కమిటీ చైర్మన్ మహబూబున్నీషా, ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్ ఆచార్యులు, పంచాయతీ కార్యదర్శి జయ ప్రకాష్, విశ్రాంత ఉపాధ్యాయులు బి.లక్ష్మణరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు .

విఒఎ కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి -అనంతగిరి:వెలుగు సంస్థలో పనిచేస్తూ మృతి చెందిన విఒఎ పాంగి శుభాకరరావు కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని స్థానిక సిపిఎం జెడ్పిటిసి దిసరి గంగరాజు, వైసిపి ఎంపీపీ శెట్టి నీలవేణి కోరారు. ఎగువశోభ పంచాయతీ గ్రామంలో మృతదేహానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి, ఎంపీపీలు మాట్లాడుతూ, డ్వాక్రా సంఘం సభ్యులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు ఆయన ఎంతో కృషి చేశారన్నారు.సిబ్బందితో కూడా కలివిడిగా ఉంటూ పని చేసేవారన్నారు.బాధిత కుటుంబానికి జెడ్పిటిసి, ఎంపిపిలు పది వేల ఆర్థిక సహాయం అందించగా వెలుగు ఇన్‌చార్జీ ఏపీఎం శ్రీరాములు చేతులమీదుగా అందించారు. మృతుని భార్యకు ఉపాధి కల్పించి ప్రభుత్వం కల్పించే రాయితీలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె.సింహాద్రి, సీపీఎం మండల కార్యదర్శి ఎస్.నాగులు, విఒఎ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

షరతులు లేని వేతన ఒప్పందం చేయాలి

-25, 26 తేదీలలో రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలి

-యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ



మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:మేజర్ పోర్టులలో షరతులు లేని వేతన ఒప్పందం చేయాలని, మూడు సంవత్సరాల బోనస్ బకాయిలు ఇవ్వాలని, పోర్టుల ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ, ఈనెల 25,26 తేదీలలో విశాఖపట్నం పోర్టు ప్రాంతంలో రిలే నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్లు యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి వి. రామలింగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం పోర్టులో సెక్షన్ వారీగా గేట్ మీటింగులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2022 జనవరి నుంచి అమలు చేయవలసిన వేతనం పెంపుదలను ప్రభుత్వం నేటి వరకు అమలు చేయకపోవడం సరికాదన్నారు. కేంద్రంలో ప్రభుత్వం మారిందని, అదే ప్రభుత్వం, షిప్పింగ్ మంత్రి, అదే విధానం అయినప్పటికీ వేతన ఒప్పంద కాలం ముగిసి ఇప్పటికే 30 నెలలు పూర్తి అయిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఐపిఎ దుర్మార్గమైన షరతులను విధించి కాలయాపన చేస్తుందని ఆరోపించారు. బోనస్ బకాయిలు చెల్లించాలని, కొత్త బోనస్ ను వెంటనే చెల్లించాలని కోరారు. ఇప్పటికైనా కేంద్ర క్యాబినెట్ ఆమోదించి అమలు చేయాలన్నారు. నేషనల్ ఎసెట్స్ మానిటైజేషన్ పైప్ లైన్ పథకం కింద మేజర్ పోర్టుల ఆస్తుల అమ్మకాన్ని ఉపసంహరించాలన్నారు. పోర్టుల్లో, టెక్నికల్, ఆపరేషనల్, మినిస్టీరియల్ అన్ని ఎంట్రీ లెవెల్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. పిపిపి పద్ధతిలో కోర్టు హాస్పిటల్స్ ను నడిపే అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2004 జనవరి 1 తరువాత ఉద్యోగాలలో చేరిన వారికి ఎన్ పిఎస్ ని రద్దు చేసి పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలన్నారు. పోర్టుల్లో పనిచేస్తున్న నాన్ పర్మినెంట్,పూల్ కళాసీలు, సిహెచ్ డి క్యాజువల్, సిహెచ్ డి కాంటీన్, సిహెచ్ డి ఆఫ్ బేసిక్, కాంట్రాక్టు కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. అంతవరకు చట్ట ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. అన్ని రకాల స్టీవ్ డోర్ కార్మికులు, షోర్ లేబర్ లకు చట్టబద్ధమైన హక్కులు కల్పించాలన్నారు. ఐపిసి లో కొత్తగా ప్రవేశపెట్టిన మూడు క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలన్నారు. ఈ సమావేశాలలో విడిఎల్ బి అండ్ డార్క్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి జె.సత్యనారాయణ, బి. లక్ష్మణరావు, త్రినాథరావు పాల్గొన్నారు.